# నేటి నిజం

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 28-8-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 22 | పేజీలు:4 | వెల: రూ.1/-


## సెప్టెంబర్ 25న భారత్ బంద్‌కు సంయుక్త్ కిసాన్ మోర్చా పిలుపు

న్యూఢిల్లీ, ఆగష్టు 27: వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతుల నిరసనలను ముందుండి నడిపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సెప్టెంబర్ 25న భారత్ బంద్‌కు పిలుపు ఇచ్చింది. వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు నిరసనగా గత ఏడాది నవంబర్ నుంచి జరుగుతున్న ఆందోళనలను మరింత ఉధృతం చేసేందుకు బంద్‌కు పిలుపు ఇచ్చామని ఎస్‌కేఎం వెల్లడించింది.

సింఘు బోర్డర్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్‌కేఎం ప్రతినిధి అశీష్ మిట్టల్ మాట్లాడుతూ భారత్ బంద్ వివరాలను తెలిపారు.

గత ఏడాది ఇదే రోజున తాము దేశవ్యాప్త బంద్‌ను జరిపామని గుర్తు చేశారు. కరోనా మహమ్మారి తీవ్రత అధికంగా ఉన్న సమయంలో గత ఏడాది జరిగిన బంద్ కంటే ఈసారి భారత్ బంద్ మరింత విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేలుళ్ల మరుసటి రోజే కాబూల్ ఎయిర్‌పోర్ట్‌కు పోటెత్తిన జనం..



కాబూల్, ఆగష్టు 27: ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో గురువారం రెండు ఆత్మాహుతి దాడులు జరిగిన విషయం తెలుసు కదా. ఈ దాడుల్లో వంద మందికిపైగా మరణించారు. దాని తాలూకు రక్తపు మరకలు ఇంకా చెదిరిపోనే లేదు.. దేశం విడిచి వెళ్లడానికి మరోసారి ఆఫ్ఘన్లు ఎయిర్‌పోర్ట్‌కు పోటెత్తారు. ఈ బాంబుల భయం కంటే అక్కడి వారికి తాలిబన్ల భయం ఎంతలా ఉందో దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు. ఎయిర్‌పోర్ట్‌లోకి ఎలాగైనా వెళ్లి.. దేశం నుంచి బయటపడితే చాలు అన్న ఆతృత అక్కడి వారిలో కనిపిస్తోంది. శుక్రవారం ఎయిర్‌పోర్ట్ దగ్గర ఉన్న పరిస్థితి వీడియోను అబ్దుల్‌హక్ ఒమెరి అనే జర్నలిస్ట్ ట్వీట్ చేశారు.

ఎయిర్‌పోర్ట్ ముందు ఉన్న మురికి కాలువలో మోకాలి లోతు నీటిలో వాళ్లు నిరీక్షిస్తుండటం ఈ వీడియోలో చూడవచ్చు. గురువారం పేలుళ్ల నేపథ్యంలో శుక్రవారం ఆఫ్ఘన్ నుంచి తరలింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. ఈ నెల 31లోపు విదేశీ బలగాలు దేశం విడిచి పెట్టనున్న నేపథ్యంలో ఆ లోపు మరోసారి ఇలాంటి దాడుల ప్రయత్నాలు జరిగే ప్రమాదం ఉన్నట్లు అమెరికా చెబుతోంది.

# దళితుల కోసం నా చివరి రక్తపుబొట్టు దాకా పోరాడుతా : సీఎం కేసీఆర్

కరీంనగర్ ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): ప్రాణత్యాగానికి సిద్ధపడి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విధంగానే దళితబంధు విజయవంతం కోసం కూడా అంతే గట్టిగా పట్టుపడతానని, నా చివరి రక్తపుబొట్టు దాకా దళితుల సమగ్రాభివృద్ధి కోసం పోరాడుతానని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దళితబంధు పథకంపై సీఎం కేసీఆర్ ఇవాళ కరీంనగర్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్?రావు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌తో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దళితజాతి పేదరికంలో మగ్గిపోతూ సామాజిక వివక్షకు గురవడానికి సభ్య సమాజమే కారణం అని తెలిపారు. ఎన్నటి నుంచి ఎవరు పెట్టిండ్రోగాని ఇది దుర్మార్గమైన ఆచారం, ఇప్పటికైనా దళితుల పట్ల అనుసరిస్తున్న దురాచారాన్ని కట్టడి చేసి వారి ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి తెలంగాణ సమాజమంతా కదిలిరావాలి అని కేసీఆర్ పిలుపునిచ్చారు. పట్టుబట్టి తెలంగాణ సాధించుకున్నామని, అదే పట్టుదలతో తెలంగాణ స్వరాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని, దళితుల సమగ్రాభివృద్ధి కూడా అంతే పట్టుదలతో సాధించుకుని తీరుతామని సీఎం స్పష్టం చేశారు. పట్టుపడితే తప్పకుండా సాధించే లక్షణం తెలంగాణ సమాజం ప్రత్యేకతని సీఎం కేసీఆర్ అన్నారు.

ఆకలి చావుల నుంచి అన్నపూర్ణగా..

ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నాం. తెచ్చుకున్న తెలంగాణను ఏడేండ్లలో అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నం. సాగు నీటి రంగాన్ని పునరుజ్జీవనం చేసుకున్నాం. దండగన్న వ్యవసాయాన్ని పండగ చేసుకున్నాం. కరెంటును నిరంతరాయంగా ఇచ్చుకుంటున్నాం. ఒకనాడు కూలీ పనికి పోయిన రాష్ట్రంలో 3 కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించుకుంటున్నాం. రాష్ట్రం వచ్చిన నాడు అర్థంకాని పరిస్థితుల నుంచి అర్థవంతమైన, గుణాత్మకాభివృద్ధి దిశగా తెలంగాణ అడుగులేస్తున్నది. ఆకలి చావుల నుంచి అన్నపూర్ణగా ఎదిగింది రాష్ట్రం. కునారిలుతున్న కులవృత్తులను కోట్లాది రూపాయలు వెచ్చించి ఆర్థికంగా నిలబెట్టుకున్నం. గొర్రెల పెంపకం, చేపల పెంపకం, చేనేతకు ఆసరా, ఎంబీసీలకు అండగా ప్రభుత్వం నిలిచింది. అన్ని రంగాలను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని వర్గాలకు అండదండలు అందిస్తూ గత ఏడేండ్లుగా తెలంగాణ ప్రభుత్వం నేనున్నాననే ధీమాను, స్ఫూర్తిని అందిస్తున్నది అని కేసీఆర్ పేర్కొన్నారు.

గాడి తప్పిన తెలంగాణ నేడు ఒక దరికి..

రైతుబంధు, రైతు బీమాతో రైతులకు వ్యవసాయానికి ఉపశమనాన్ని కలిగించినం. గత వలసపాలనలో అన్ని రంగాల్లో గాడి తప్పిన తెలంగాణ నేడు ఒక దరికి చేరుకున్నది. బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, బోదకాల బాధితులకు పెన్షన్ అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, అమ్మఒడి వాహనాలు వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ఇప్పుడిప్పుడే అన్ని రంగాలను సరిదిద్దుకుంటూ, సవరించుకుంటూ ఒక దరికి చేరుకున్నాం. నేను ఎప్పటినుంచో అనుకుంటున్న దళిత అభివృద్ధి కార్యచరణకు ఇప్పుడు సమయం వచ్చింది. నేను సిద్దిపేట ఎమ్మెల్యేగా వున్నప్పుడు సిద్ధిపేటలో దళిత చైతన్య జ్యోతి కార్యక్రమాన్ని చేపట్టి దళిత జాతి అభ్యున్నతి కోసం కృషి చేసిన. దళితబంధు గత సంవత్సరం మే నెలలోనే ప్రారంభమయ్యేది ఉండే, కానీ కరోనా కారణం చేత ఆలస్యమైంది అని కేసీఆర్ తెలిపారు.



## సెప్టెంబర్ 2న తెలంగాణ వ్యాప్తంగా టీఆర్ఎస్ జెండా పండుగ : కేటీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 27:టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేసీఆర్ ఆదేశం మేరకు పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం కార్యాచరణను రూపొందించాం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2వ తేదీన 12,769 గ్రామ పంచాయతీల్లో, 142 మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జెండా పండుగతో పాటు గ్రామ కమిటీలు, వార్డు కమిటీల నిర్మాణం చేయాలని సూచించారు. అదే రోజు సీఎం కేసీఆర్ ఢిల్లీలో టీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరూ ఆ కార్యక్రమంలో పాల్గొంటారు అని కేటీఆర్ తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి 12వ తేదీ వరకు గ్రామ, వార్డు కమిటీల ప్రక్రియ నిర్వహించాలి. సెప్టెంబర్ 12 నుంచి 20వ తేదీ లోపు మండల కమిటీలు,పట్టణ కమిటీలు ఏర్పాటు చేయాలి. వీటి తర్వాత ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు సమక్షంలో జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గం ఎంపిక ఉంటుంది. సెప్టెంబర్ 20 తర్వాత రాష్ట్ర కార్యవర్గం ఎంపిక జరుగుతుంది. ఈ కమిటీలన్నీ సెప్టెంబర్ చివరి వరకు పూర్తవుతాయి. హైదరాబాద్‌లో బస్తీ కమిటీలు, డివిజన్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. పార్టీ యొక్క నియామవళి ప్రకారం.. క్రియాశీల సభ్యులను ఎంపిక చేస్తారు. 51 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీతో పాటు మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తాం. సోషల్ మీడియాకు సంబంధించి కమిటీలు వేయాలని మండల, పట్టణ, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.



## కాబుల్ ఎయిర్ పోర్ట్ వద్ద వరుస పేలుళ్లలో తప్పించుకున్న భారతీయులు



కాబూల్, ఆగష్టు 27:ఆఫ్ఘనిస్థాన్ అలా తాలిబన్ల చేతిలోకి వెళ్లిందో లేదో అప్పుడే బాంబుల మోతలు మోగిపోతున్నాయి. ఆఫ్ఘాన్ రాజధాని కాబూల్ బాంబు దాడులతో దద్దరిల్లింది. ఉగ్ర దాడితో హమీద్ కర్జాయ్ విమానాశ్రయం రక్తసిక్తమైంది. ఇప్పటి వరకు 6 పేలుళ్లు జరగగా? 72 మంది మృతి చెందారు. వీరిలో 60 మంది సాధారణ పౌరులు కాగా? 13 మంది అమెరికా సైనికులు. చనిపోయిన వారిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఎయిర్‌పోర్ట్‌లో ఆత్మాహుతి దాడులను తాలిబన్లు ఖండించారు. ఐసిస్ గ్రూప్ కాబూల్ విమానాశ్రయంపై దాడులకు పాల్పడవచ్చని తాము ముందుగానే అనుమానించామని, ఇదే విషయాన్ని అమెరికాకు కూడా చెప్పామని ఓ ప్రకటనలో తెలిపారు. పేలుడు జరిగిన ప్రాంతం అమెరికా దళాల ఆధీనంలో ఉన్నట్టు పేర్కొన్నారు. కాబూల్ ఉగ్రవాద దాడులను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఖండించారు.

మరోవైపు ఈ పేలుళ్ల నుంచి 160 మంది భారతీయులు సురక్షితంగా తప్పించుకున్నారు. వీరిలో 145 మంది సిక్కులు కాగా, 15 మంది హిందువులు. కాబూల్ ఎయిర్ పోర్టు వద్ద బాంబు పేలుళ్లు సంభవించడానికి కొన్ని గంటల ముందే వీరందరినీ అక్కడి నుంచి భారత్ కు తరలించారు. ఆఫ్ఘన్ లో ఇంకా వేలాది మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తోంది. తాజా పేలుళ్ల నేపథ్యంలో అక్కడి నుంచి ప్రజలను తరలించడం మరింత క్లిష్టంగా మారింది. ఎయిర్ పోర్టు లోపల ఉన్నవారు సురక్షితంగా ఉన్నారని భావిస్తున్నప్పటికీ? ఎయిర్ పోర్టు బయటి పరిస్థితి దారుణంగా ఉంది. మరోవైపు సామాన్యుల ముసుగులో ఉగ్రవాదులు కూడా ఎయిర్ పోర్టులోకి ప్రవేశించే అవకాశం ఉందనే అనుమానాలు భయాలను మరింత పెంచుతున్నాయి.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన సైబరాబాద్ సీపీ

హైదరాబాద్ , ఆగష్టు 27:రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం స్టీఫెన్ రవీంద్ర ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు రవీంద్ర మొక్కను బహుకరించారు. వీసీ సజ్జనార్ స్థానంలో స్టీఫెన్ రవీంద్రను సైబరాబాద్ సీపీ ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. టీఎస్ ఆర్టీసీ ఎండీగా సజ్జనార్ నియమితులయ్యారు.



### చరిత్రలో నేటినిజం



కం॥ జీవము దేశమ్మునకని
భావించుచు సైన్యమందు భటుడై కార్గిల్
పావన పోరాటమున-మ
హావీరుండై నిలిచె గాదె "సంజూ నయ్యార్" !!

(ఆగష్టు 28 మహావీర చక్రం పొందిన అంజూనయ్యార్ జయంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210



## డబ్బు సంచులతో దొరికిపోయినోన్ని అధ్యక్షుడిని చేశారు : కేటీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 27: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎవరూ దిక్కు లేక పక్క పార్టీలో నుంచి ఒకర్ని దిగుమతి చేసుకున్నారు. చంద్రబాబు తొత్తు, బినామీని తీసుకొచ్చి పార్టీకి అధ్యక్షుడిని చేశారు. డబ్బు సంచులతో దొరికిపోయినోన్ని అధ్యక్షుడిని చేశారు. ఆయన పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుండు. నోరు పారేసుకుంటున్నాడు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను సాధించిన నాయకుడు, సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర గల నాయకుడు, ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చిన నాయకుడు కేసీఆర్. ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. అలాంటి నాయకుడిని పట్టుకొని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆయన కాలి గోరికి కూడా సరిపోని కొంతమంది నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. కుక్క కాటుకు చెప్పు దెబ్బ తప్పదు.. ప్రతిపక్షాలకు కూడా అలానే బుద్ధి చెప్తాం అని కేటీఆర్ అన్నారు. సహనానికి ఓపిక ఉంటుంది. ఓపికకు కూడా హద్దులుంటాయి. రాజకీయాల్లో సంస్కారవంతంగా మాట్లాడాలని కోరుకుంటారు. కానీ ఆ పరిస్థితి లేదు. తప్పని పరిస్థితుల్లోనే మాట్లాడుతున్నాం. మహారాష్ట్రలో ముఖ్యమంత్రిని ఒక మాట అంటే కేంద్ర మంత్రి అని కూడా చూడకుండా లోపల వేశారు. మరి వేం కూడా చేయమంటారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

జర్నలిస్టు ముసుగులో ఉండి కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. జర్నలిజం ముసుగులో బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతోంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కరోనా కట్టడికి పకడ్బందీ చర్యలు : జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ , ఆగష్టు 27:కరోనా వైరస్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నంబరు-10లోని పంచవటికాలనీని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి సందర్శించారు. కాలనీలో వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి కావడంలో స్థానికులను ఆమె అభినందించి కమిటీ ప్రతినిధులకు జీహెచ్ఎంసీ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

అనంతరం రోడ్డు నంబరు-7లోని గతి ప్రభుత్వ పాఠశాల గదుల్లో రసాయనాల పిచికారీని ఆమె పరిశీలించారు. ఇబ్రహీంనగర్‌లోని వ్యాక్సినేషన్ శిబిరాన్ని వారు సందర్శించారు.

గతేడాది కరోనాతో కారణంగా చనిపోయిన ఉపాధ్యాయులు మాధవి, రాజ్‌కుమార్ కుటుంబాలను ఆదుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు మేయర్ దృష్టికి తెచ్చారు.

ఈ మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బస్తీల్లో, కాలనీలో ముమ్మరంగా చేపట్టిన వ్యాక్సినేషన్ శిబిరాలను స్థానికులు వినియోగించుకోవాలన్నారు. కొవిడ్ నివారణ చర్యలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు.

సెప్టెంబర్ ఒకటి నుంచి విద్యాసంస్థలు తెరుస్తున్న దృష్ట్యా విద్యార్థులు కొవిడ్ బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, జీహెచ్ఎంసీ సిబ్బంది, కాలనీవాసులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## బండి సంజయ్ పాదయాత్రపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్ , ఆగష్టు 27: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్రపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆయన పేరు బండి సంజయ్.. పెట్రోల్ ధర ఎక్కువైవందని బండిలో తిరగకుండా.. పాద యాత్ర చేస్తున్నాడంటా అని విమర్శించారు. ఆయనకు వచ్చిన సమస్య ఏంటి? ప్రజా సంగ్రామ యాత్ర ఎందుకు చేస్తున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో హైదరాబాద్‌లో వరదలు వచ్చాయి.. అదే సమయంలో వరదలు వచ్చిన గుజరాత్‌కు రూ. 1000 కోట్లు, ఇంకో చోట రూ. 500 కోట్లు ఇచ్చాం. తెలంగాణకు మొండి చెయ్యి చూపాం. అయినా తమను ఆశీర్వదించండి అని అడుగుతారా? అని కేటీఆర్ ప్రశ్నించారు

బేచో ఇండియా ప్రారంభం

ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన రూ. 6 లక్షల కోట్ల ఆస్తులను అమ్మేస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. మోదీ చెప్పినట్టు డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా అయిపోయింది. ఇప్పుడు బేచో ఇండియా కార్యక్రమం ప్రారంభమైంది అని కేటీఆర్ విమర్శించారు. ఇంకైమేనా ఆస్తులు మిగిలిపోతే వాటిని గుర్తించి అమ్ముదాం అని యాత్రలు చేస్తున్నారా? అని బండి సంజయ్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రజలు అయితే అదే అనుకుంటున్నారు. మౌలాలిలో 21 ఎకరాల రైల్వే భూమిని అమ్మకానికి పెడుతున్నారని వార్తలు వచ్చాయి. ఇది కూడా 6 లక్షల కోట్ల ప్యాకేజీలో భాగమే. మోదీ 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఎందుకివ్వలేదు. ఈ ఏడేండ్లలో తెలంగాణ ప్రజలు కేంద్రానికి రూ. 2 లక్షల 72 వేల కోట్లు పన్నుల రూపంలో కట్టారు. కానీ కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చింది మాత్రం రూ. లక్షా 45వేల కోట్లు మాత్రమే. ఒక్క పైసా కూడా అదనంగా ఇవ్వలేదు. ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశ్నించారు.

పాదయాత్రలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నర్సరీలు, వైకుంతధామాలు చూడు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద సాగులోకి వచ్చిన పొలాలు చూడు. రైతు ముఖంలో సంతోషం చూడు, పెన్షన్లు అందుకుంటున్న వృద్ధుల ముఖాల్లో సంతోషం చూడాలని బండి సంజయ్‌కు కేటీఆర్ సూచించారు. బీజేపీకి ఎందుకు ఓటేయ్యాలి. ఎందుకు ఆశీర్వదించాలి. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు.. మీ మాటలను నమ్మే స్థితిలో లేరు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# దేశ రక్షణలో వీర నారీమణులు

## (భారత సైన్యంలో ఐదుగురు అధికారిణులు కల్నల్ హోదా కల్పించిన సందర్భంగా)

అమ్మలా గోరు ముద్దలు తినిపించగలదు. ప్రేమానురాగాల సప్తస్వరసంగీతాన్ని ఆలపించగలదు. ఒడిన కోవెలగా మలిచి లాలించగలదు. శీతల మనోవికాసంతో కుటుంబ ఆకలిని అర్థం చేసుకోగలదు. అంతరిక్ష అద్భుతాల్ని శోధించగలదు. గగనాన విమాన గతిని శాసించగలదు. ఝాన్సీలా కత్తి దూసగలదు. రుద్రమదేవిగా రౌద్రరూపంతో పాపుల వినాశనం చేయగలదు. ఇందుగలడందులేదని, ఏ రంగంలోనైనా బుల్లెట్‌లా దూసుకు పోగలదు. రాకెట్లులా శత్రువు గుండెల్లో తూటాను దించగలదు. అన్నీ తనకు తెలిసిన విద్యలే అని, ఆమెకు అసాధ్యమనేది ఆమెడ దూరమని ప్రతి సందర్భంలో రుజువు చేస్తున్న మహిళామణులు మన ముందు ఎందరో ఉన్నారు. ఇలాంటి అసాధారణ వీరవనితలందరికీ దేశభక్తి వందనాలు. మృదు మహిళామణులే అయినా, యుద్ధక్షేత్రంలో శత్రువుతో పోరాడటంలో ప్రధాన భూమిక నిర్వహించగలదని రుజువు చేస్తున్న సైనికాధికారిణులు మరో మైలు రాయిని దాటి సగర్వంగా వీరత్వాన్ని చాటుతున్నారు. పురుషులకు తామేమీ తీసిపోమని పలు సందర్భాలలో రుజువు చేసిన మహిళాధికారులు నేడు భారత సైన్యంలో మరో అపూర్వ ముందడుగు వేశారు.

భారత సైన్యంలో గత 26 ఏండ్ల నుంచి దేశానికి ఎనలేని సేవలు అందిస్తున్న ఐదుగురు అధికారిణులకు తొలిసారిగా కల్నల్ హోదా కల్పిస్తూ నియామక బోర్డు నిర్ణయం తీసుకోవడం రక్షణ రంగంలో ఓ అపూర్వ ఘట్టంగా నిలుస్తున్నది. ఇండియన్ ఆర్మీలో తొలిసారి సిగ్నల్ కోర్, ఈయంఈ (ఎలక్ట్రానిక్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్), ఇంజనీర్స్ కోర్ విభాగాలకు చెందిన ఐదుగురు అధికారిణులు కల్నల్ హోదాను పదోన్నతిగా పొంది పర్మనెంట్ కమిషన్‌కు అర్హత సాధించడం హర్షదాయకం. తొలుత మహిళాధికారులకు షార్ట్ సర్వీస్ కమిషన్‌కు (గరిష్టంగ 14 ఏండ్ల సర్వీస్) మాత్రమే పరిమితం చేయబడిన అడ్డుగోడల్ని దాటుకుంటూ, లింగ భేధాన్ని చెరిపేస్తూ, నేడు ఈ అద్భుత అవకాశాన్ని తమ అర్హతతో సాధించారు. ఇప్పటి వరకు సైన్యంలో వైద్య (ఐయంసి), న్యాయ (జెఏజి), విద్య (ఏఈసి) విభాగాలకు మాత్రమే పరిమితమైన కల్నల్ హోదా నేడు సిగ్నల్స్, ఈయంఈ, ఇంజనీర్స్ కోర్‌లకు కూడా వర్తింపచేయడం శుభపరిణామంగా చెప్పవచ్చు. ఇప్పటి వరకు 26 ఏండ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న సైనికాధికారిణులు లెఫ్టినెంట్ కల్నల్ సంగీతా సర్దానా (సిగ్నల్స్), సోనియా ఆనంద్, నవనీత్ దుగ్గల్ (ఈయంఈ), రీనూ ఖన్నా, రిచా సాగర్ (ఇంజనీర్స్)లకు కల్నల్ హోదా పదోన్నతి లభించింది. స్త్రీ, పురుష వివక్ష రహిత సైన్యం దిశగా అడుగులు వేయడానికి ఇదోక విశేషంగా పేర్కొనవచ్చు. ఇలాంటి నిర్ణయాలతో మహిళాధికారులకు దేశ రక్షణ రంగంలో కెరీర్ అవకాశాలు పెరుగుట జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవలే 18 ఆగష్టు 2021న సుప్రీమ్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో మహిళా అభ్యర్థులకు యన్‌డిఏ (నేషనల్ డిఫెన్స్ అకాడమీ) ప్రవేశ పరీక్షకు అవకాశం కల్పించడం మనకు తెలిసిందే. దీనితో ఇండియన్ ఆర్మీ, ఏయిర్ ఫోర్స్, నావీ విభాగాల్లో మహిళాధికారులకు పర్మనెంట్ కమిషన్ పొందగల అర్హత దక్కినట్లు అయ్యింది. ఇప్పటి వరకు త్రివిధ దళాల్లో మహిళాధికారిణుల్ని గరిష్టంగ 14 ఏండ్ల షార్ట్ సర్వీస్ కమిషన్‌కు మాత్రమే పరిమితం చేయగా, 17 మార్చి 2020న సుప్రీమ్ కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం అర్హత, ఆసక్తిగల అధికారిణులను పర్మనెంట్ కమిషన్‌కు పరిగణించాలని ఆదేశించింది. భారత సైన్యంలో తొలిసారి 1992లో ఇండియన్ నావీలో అధికారిణులను ఎంపిక చేయడం జరిగిన 30 ఏండ్ల తరువాత నేడు మరికొన్ని రక్షణ విభాగాల్లో పర్మనెంట్ కమిషన్ పొందేందుకు దారులు తెరుచుకున్నాయి. భారత నావికాదళంలో 1992లో ప్రథమ సైనిక అధికారిణిగా ప్రసన్న ఎంపిక కావడం, తనకు పర్మనెంట్ కమిషన్ అవకాశం కల్పించక పోవడంతో షార్ట్ సర్వీస్‌తోనే పదవి విరమణ చేశారు. పుట్టుకతో ఎవరు అధికారి కాదని, అర్హత కలిగి సాధన, సాఫల్యత చూపిన ఎవరికైనా సమానావకాశాలు ఇవ్వాలనే ప్రాధమిక సూత్రం ఆధారంగా యువతులకు ఆసక్తి, అర్హతలను బట్టి భౌతిక పరీక్షలు, క్షేత్రస్థాయి శిక్షణలో రాణిస్తే పురుషులకు సమానంగా అవకాశాలు ఇవ్వాలని కోర్టు ఆదేశించడంతో సైన్యంలో లింగ వివక్ష కొంత తగ్గిందని చెప్పవచ్చు. రాబోయే సంవత్సరాల్లో నావీకి తొలి మహిళా ఛీఫ్‌ను చూడాలనే కోరిక కూడా త్వరలో తీరవచ్చు. 10+2 తరువాత యన్‌డిఏ, డిగ్రీ తరువాత సిడియస్ (కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్)ల ద్వారా సైన్యంలో పర్మనెంట్ కమిషన్డ్ అధికారులను నియమించడం జరుగుతోందని మనకు విధితమే.

ఇండియన్ ఆర్మీలో 12.18 లక్షల పురుషులు, 6,807 మహిళామణులు (0.56 శాతం) పని చేస్తున్నారు. ఏయిర్ ఫోర్స్‌లో 1.47 లక్షల పురుషులతో పాటు 1,607 మహిళలు (1.08 శాతం) సేవలు చేస్తున్నారు. ఇండియన్ నావీలో 6.5 శాతంతో 704 మంది అధికారిణులు పని చేస్తున్నారు. భారత త్రివిధ దళాల్లో 1700 మహిళల్ని మిలటరీ పోలీస్ కార్ప్స్‌లో నియమించడానికి కాల పత్రిక నిర్ణయించారు. నేడు భారత త్రివిధ దళాల్లో 9,118 మహిళలు అధికార హోదాలో, 1,700 జవాన్ల స్థాయిలో దేశసేవ చేస్తున్నారు. నేడు మహిళా సైనికాధికారిణులు హెలికాప్టర్ పైలెట్లుగా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ 'ఫ్రంట్-లైన్ కంబాట్' (ప్రత్యక్ష యుద్ధ స్థానాలు) విధులకు మహిళల్ని దూరంగానే ఉంచడం జరుగుతోంది. వార్ షిప్స్, ట్యాంకులు, కంబాట్ స్థానాల్లో నేటికీ మహిళలకు 'నో ఎంట్రీ' నియమమే నడుస్తున్నది. అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, కెనడా, ఇజ్రాయిల్ లాంటి దేశాల్లో సైనిక అధికారిణులను 'ఫ్రంట్-లైన్ కంబాట్' స్థానాల్లో నియమిస్తున్నారని, అదే విధానం మన త్రివిధ దళాల్లో కూడా అవలంభించాలని కోరుకుందాం. 'మహిళ అబల కాదని, సాయుధ సబల' అని రుజువు చేసుకునే అవకాశాలను కల్పిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# రాష్ట్రంలో విమాన రంగ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయవలసిందిగా కర్నాటక ముఖ్యమంత్రికి లేఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 27:రాష్ట్రంలో విమానయాన మౌలిక సదుపాయాలను త్వరితగతిన బలోపేతం చేసేందుకు వ్యక్తిగతంగా చొరవ తీసుకోవలసిందిగా కర్నాటక ముఖ్యమంత్రి బసవరాజ్ సోమప్ప బొమ్మాయికి కేంద్ర విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా లేఖ రాశారు. దేశంలో పెరుగుతున్న ప్రయాణీకుల డిమాండ్‌ను తీర్చడానికి రానున్న 4-5 ఏళ్ళలో రూ. 20,000 కోట్ల వ్యయంతో దేశంలోని విమానాశ్రయాల అభివృద్ధిని, విస్తరణను ఎఎఐ చేపట్టింది.

విమానయాన రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల అమలును ప్రభావితం చేస్తున్న అంశాలను సింధియా ముఖ్యమంత్రి బసవరాజ్ సోమప్ప బొమ్మాయ్ దృష్టికి తెచ్చారు. సింధియా పేర్కొన్న అంశాలు:

– బెలగావి విమానాశ్రయ విస్తరణకు ఎఎఐ 370 ఎకరాలను కోరగా, ఇప్పటి వరకూ 348.6 ఎకరాలను మాత్రమే అప్పగించారు.

–అలాగే, మైసూర్ విమానాశ్రయం కోసం 240 ఎకరాలను కేటాయించవలసిందిగా ఎఎఐ కోరింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిని ఇంకా అప్పగించవలసి ఉంది.

–వీటితో పాటుగా శివమొగ్గ, విజయపుర విమానాశ్రయాలలో కార్యకలాపాలను ప్రారంభించేందుకు కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని, తద్వారా ఆర్‌సిఎస్- ఉడాన్ (ఉఅంబి) 4.1 కింద వచ్చిన బిడ్లను అప్పగించేందుకు పరిగణించవచ్చు. అంతేకాకుండా, ఈ రెండు విమానాశ్రయాలకు సంబంధించి మార్గాలను అప్పగించేందుకు 100% విజిఎఫ్ మద్దతును ఇచ్చేందుకు తమ అంగీకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలియచేయాలి. ఎందుకంటే అవి రాష్ట్ర ప్రాంతీయ అనుసంధాన పథకం (స్టేట్ రీజినల్ కనెక్టివిటీ స్కీం - ఎస్‌సిఆర్‌ఎస్) కింద వస్తాయి.

ప్రాంతీయ వాయు అనుసంధాన నిధి ట్రస్టు ( రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ ఫండ్ ట్రస్ట్ -ఆర్‌ఎసిఎఫ్‌టి)కు విజిఎఫ్ వాటా కింద రూ. 7.55 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బాకాయి ఉంది.

# కొత్త డ్రోన్ నియమాలు భారతదేశానికి ఈ రంగంలో ఒక ప్రతిష్టాత్మకమైన ఘడియను తీసుకు వస్తాయి: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 27:కొత్త డ్రోన్ నియమాలు భారతదేశం లో ఈ రంగానికి ఒక ప్రతిష్టాత్మకమైన ఘడియ ను తీసుకు వస్తాయి అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. కొత్త డ్రోన్ నియమావళి ఈ రంగం లో కృషి చేస్తున్న మన యువత కు, స్టార్ట్- అప్స్ కు ఎంతగానో సహాయకారి కాగలదు అని కూడా ఆయన అన్నారు.

"కొత్త డ్రోన్ నియమాలు భారతదేశం లో ఈ రంగాని కి ఒక ప్రతిష్టాత్మకమైన ఘడియ ను తీసుకు వస్తాయి. ఈ నియమాలు స్వీయ ధ్రువీకరణ పైన, విశ్వాసం పైన ఆధారపడి ఉన్నాయి. ఆమోదాలు, నియమ పాలన తాలూకు ఆవశ్యకతలతో పాటు ప్రవేశం సంబంధిత అడ్డంకుల ను కూడా చెప్పుకోదగిన స్థాయి లో తగ్గించడం జరిగింది.

కొత్త డ్రోన్ నియమాలు ఈ రంగం లో కృషి చేస్తున్న మన యువతీ యువకుల కు, స్టార్ట్- అప్స్ కు ఎంతగానో సహాకారి కాగలవు. ఇవి వ్యాపారానికి, నూతన ఆవిష్కరణల కు సరికొత్త అవకాశాల ను ప్రసాదిస్తాయి. ఇవి భారతదేశాన్ని ఒక డ్రోన్ హబ్ గా తీర్చిదిద్దడం కోసం నూతన ఆవిష్కరణ లు, సాంకేతిక విజ్ఞానం, ఇంజినీరింగ్ లలో భారతదేశానికి ఉన్న బలాల ను ఉపయోగించుకోవడం లో సాయపడుతాయి" అని ప్రధాన మంత్రి అనేక ట్వీట్ లలో పేర్కొన్నారు.

# నావికాదళ విన్యాసాలు మలబార్‌లో పాలుపంచుకున్న భారతీయ నావికాదళం

న్యూఢిల్లీ, ఆగష్టు 27:భారతీయ నావికాదళం యుఎస్ నావీ (యుఎస్‌ఎన్), జపనీస్ మారిటైం సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జెఎంఎస్‌డిఎఫ్), రాయల్ ఆస్ట్రేలియన్ నావీ (ఆర్ఎఎన్) తో కలిసి ఆగష్టు 26-29 వరకు జరుగనున్న సీఫేజ్ మలబార్ 2021 విన్యాసాలలో పాలు పంచుకుంటోంది.

సముద్ర విన్యాసాలలో భాగమైన మలబార్ సిరీస్ 1992లో ఐఎన్-యుఎస్‌ఎన్ ( భారత- అమెరికా నావికాదళాల) విన్యాసాలుగా ప్రారంభమయ్యాయి. మలబార్‌లో శాశ్వత సభ్యుడిగా 2015లో జెఎంఎస్‌డిఎఫ్ చేరింది. అనంతరం, 2020లో జరిగిన విన్యాసాలలో రాయల్ ఆస్ట్రేలియన్ నావీ పాల్గొంది. ఈ ఏడాది యుఎస్ ఎన్ పశ్చిమ పసిఫిక్ లో నిర్వహిస్తున్న మలబార్ విన్యాసాలు ఈ పరంపరలో 25 ఎడిషన్.

ఈస్టర్న్ ఫ్లీట్ కు నాయకత్వం వహిస్తున్న విఎస్ ఎం, ఫ్లాగ్ ఆఫీసర్, రేర్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి సారథ్యంలో భారతీయ నావికాదళానికి చెందిన ఐఎన్‌ఎస్ శివాలిక్, ఐఎన్‌ఎస్ కద్మత్, సహా పి81 పాట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ పాలు పంచుకుంటున్నాయి. యుఎస్‌ఎస్ బారీ, యుఎస్‌ఎన్‌ఎస్ రాప్పాహాన్నాక్, యుఎస్‌ఎన్‌ఎస్ బిగ్ హార్న్, పి8ఎ ఎయిర్ క్రాఫ్ట్ యుఎస్ నావికాదళానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కాగా, ఒక జలంతర్గామి, పి1 పాట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ కు అదనంగా జెఎస్ కాగా, మురసమే, షిరనుయి జాపనీస్ మారిటైం సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. హెచ్‌ఎంఎఎస్ వార్రాముంగా రాయల్ ఆస్ట్రేలియన్ నావీకి ప్రాతినిధ్యం వహిస్తోంది.

ఆగష్టు 21-24 వరకు గ్వామ్‌లో జరిగిన ఆపరేషన్ టర్న్ ఎరౌండ్ లో పాలుపంచుకున్న భారతీయ నావికాదళ నౌకలు అక్కడి నుంచి బయిలుదేరాయి గమ్యాన్ని చేరుకున్నాయి. ఈ దశలో, ఈస్టర్న్ నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ ఎబిసింగ్, ఎవిఎస్‌ఎం, విఎస్‌ఎం తమ యుఎస్ నావికాదళానికి చెందిన సహ అధికారులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

మలబార్ -21లో యాంటీ సర్ఫేస్, యాంటీ -ఎయిర్, యాంటీ - సబ్‌మెరైన్ యుద్ధకవాతు, సేనా విన్యాసాలు, వ్యూహాత్మక విన్యాసాలు సహా అనేక సంక్లిష్టమైన విన్యాసాలకు సాక్షిగా నిలువనుంది. ఇందులో పాలుపంచుకున్న నావికాదళాలకు పరస్పర నైపుణ్యాలను, అనుభవాలను పంచుకుని లబ్ధి పొందేందుకు ఈ విన్యాసాలు అవకాశాన్ని కల్పిస్తాయి.

కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ఆరోగ్యవంతమైన ఆరోగ్య ప్రోటోకాళ్ళను పాటిస్తూ ఈ విన్యాసాలను నిర్వహించడం అన్నది ఇందులో పాలు పంచుకుంటున్న నావికాదళాల స్వేచ్ఛాయుత, బహిరంగ, సంఘటిత ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల ఉమ్మడి దార్శనికతకు అద్దం పడతాయి.

# పునరుద్ధరించిన జలియన్‌వాలా బాగ్ స్మారక ప్రాంగణాన్ని ఆగస్టు 28న జాతికి అంకితం చేయనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 27:పునరుద్ధరించిన జలియన్‌వాలా బాగ్ స్మారక ప్రాంగణాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 ఆగష్టు 28న సాయంత్రం 6:25 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతికి అంకితం చేస్తారు. దీంతోపాటు స్మారకం వద్ద నిర్మించిన మ్యూజియం గ్యాలరీలను కూడా ఆయన ప్రారంభిస్తారు. ఈ ప్రాంగణం నవీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు కూడా ఇక్కడ ప్రదర్శించబడతాయి.

ఇప్పటిదాకా చేపట్టిన చర్యలు

నిరుపయోగ భవనాలతోపాటు అవసరాలకు తగినట్లు వాడనివాటిని తిరిగి వాడుకునే సానుకూల పునర్వినియోగ విధానంలో నాలుగు మ్యూజియం గ్యాలరీలను సృష్టించారు. ఆ కాలంలో పంజాబ్‌లో చోటు చేసుకున్న ఉదంతాల చారిత్రక ప్రాధాన్యాన్ని ఈ గ్యాలరీలు చాటిచెబుతాయి. ఇందుకోసం దృశ్య-శ్రవణ సమ్మేళన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ప్రొజెక్షన్ మ్యాపింగ్, 3డి రెప్రజెంటేషన్, శిల్ప-చిత్రరూపాలతో ఏర్పాట్లు చేశారు. అలాగే 1919 ఏప్రిల్ 13నాటి సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపడం కోసం 'సౌండ్ అండ్ లైట్' ప్రదర్శన కూడా ఉంటుంది. ఇవేకాకుండా ఈ ప్రాంగణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టబడ్డాయి. పంజాబ్ స్థానిక వాస్తుశైలిలో వారసత్వ సంపద పునరుద్ధరణ పనులు కూడా విస్తృతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమరవీరుల బావిని మరమ్మతు చేసి, వినూత్న అదనపు నిర్మాణంతో పునరుద్ధరించారు. బాగ్ మధ్యలోని జ్వాల స్మారకాన్ని కూడా మరమ్మతుచేసి, పునరుద్ధరించారు. అక్కడి వనరును తామర తటాకంగా రూపుదిద్ది, రెండువైపులా దారిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దారు. అనేక కొత్త, ఆధునిక సదుపాయాలను కూడా కల్పించారు. సముచిత సూచికలతో నడక మార్గాలను కొత్తగా రూపొందించారు. వ్యూహాత్మక ప్రదేశాల్లో విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేశారు. స్థానిక మొక్కలతో ఆ ప్రదేశం మొత్తాన్ని, కట్టడ సహితంగా తోట అంతటా శ్రవణ పరికరాలు ఏర్పాటు చేశారు. రక్షిత ప్రదేశాన్ని, అమర జ్యోతిని, జెండా వేదిక తదితరాల కోసం కొత్త ప్రదేశాలను కూడా అభివృద్ధి చేశారు.

ప్రధానమంత్రి రాక నేపథ్యంలో కేంద్ర సాంస్కృతిక శాఖ, గృహ-పట్టణ వ్యవహారాల శాఖ మంత్రులు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి, పంజాబ్ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిసహా హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులతోపాటు పంజాబ్ నుంచి పార్లమెంటు ఉభయసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, జలియన్ వాలా బాగ్ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# యువచిత్రకారుడిని ఆయన చిత్రలేఖ నాకు మరియు ప్రజారోగ్యం పట్ల ఆయనలో ఉన్న శ్రద్ధకుగాను ప్రశంసించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 27:బెంగళూరు కు చెందిన ఒక విద్యార్థి శ్రీ స్టీవెన్ హ్యారిస్ ను ఆయన చిత్రించిన చిత్రలేఖనాలకు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ తనకు ఒక ఉత్తరాన్ని పంపించారు. 20 యేళ్ల వయస్సు వున్న ఆ చిత్రకారుడు ప్రధాన మంత్రి కి ఒక లేఖ ను రాస్తూ, ప్రధాన మంత్రి తాలూకు సుందర వర్ణచిత్రాలు రెండిటిని ఆ లేఖ తో పాటు పంపారు. దీనికి ప్రధాన మంత్రి సమాధానమిస్తూ ఆ యువకుడి ని పొగడి, ఉత్సాహపరచారు.



సృజనాత్మక రంగాల లో యువత కు గల ఆసక్తి ని, అంకిత భావాన్ని చూసి తనకు సంతోషం వేస్తోందని ప్రధాన మంత్రి తన లేఖ లో పేర్కొన్నారు. 'విషయాల ను లోతు గా పరిశీలించేటటువంటి మీ యొక్క ప్రతిభ కు మీ చిత్రలేఖనాలు అద్దం పడుతున్నాయి. ఎంతో చిన్న చిన్న భావాల ను సైతం సూక్ష్మ గ్రాహ్యత తో మీరు ఒడిసిపట్టుకున్న తీరు కు మనస్సు ఆనంద తరంగితం అవుతూంది' అని ప్రధాన మంత్రి తన లేఖ లో రాశారు. ప్రస్తుత కష్ట కాలం లో ప్రజల ఆరోగ్యం పట్ల, వారి సంక్షేమం పట్ల యువ చిత్రకారుడు వెలిబుచ్చిన అభిప్రాయాల ను ప్రధాన మంత్రి కొనియాడారు. "అందరికీ టీకాలు ఇప్పించేందుకు ఉద్దేశించిన ప్రచార కార్యక్రమం, క్రమశిక్షణ.. వీటితో పాటు 130 కోట్ల మంది భారతీయుల సమష్టి ప్రయాస లు మహమ్మారి కి వ్యతిరేకంగా మనం చేస్తున్న యుద్ధానికి బలాన్ని ఇస్తున్నాయి" అని ప్రధాన మంత్రి రాశారు.

సకారాత్మకత ను వ్యాపింపజేయడం కోసం శ్రీ స్టీవెన్ చేసిన ప్రయాస ను చూసి ప్రజలు ప్రేరణ ను పొందగలరన్న ఆశాభావాన్ని ప్రధాన మంత్రి వ్యక్తం చేశారు.

శ్రీ స్టీవెన్ తన లేఖ లో గత 15 సంవత్సరాలు గా తాను చిత్రలేఖనాన్ని కొనసాగిస్తున్నానని, మరి వివిధ స్థాయిల లో 100 కు పైగా పురస్కారాల ను గెలిచానని తెలియజేశారు. ప్రధాన మంత్రి తన కు ప్రేరణ గా నిలచారని ఆయన అభివర్ణిస్తూ, కరోనా కు వ్యతిరేకం గా పోరాడడం లో భాగం గా భారతదేశం నిర్వహిస్తున్న అందరికీ టీకాలు కార్యక్రమాన్ని ప్రశంసించారు.

# ఎంఓఈ ఇన్నోవేషన్ సెల్, ఏఐసీటీఈ, బీపీఆర్&డీల 'మంథన్-2021' హ్యాకథాన్ ప్రారంభం

న్యూఢిల్లీ, ఆగష్టు 27:'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' (బీపీఆర్ డ డీ) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ నీరజ్ సిన్హా, 'ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్స్ (ఏఐసీటీఈ) చైర్మెన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుధేలు సంయుక్తంగా ఈ రోజు న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన 'మంథన్-2021' హ్యాకథాన్‌ను ఆవిష్కరించారు. 'మంథన్-2021' హ్యాకథాన్‌ను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ డ డీ) విద్యా మంత్రిత్వ శాఖ మరియు ఏఐసీటీఈ ఇన్నోవేషన్ సెల్ సౌజన్యంతో నిర్వహిస్తుంది. 'మంథన్-2021' హ్యాకథాన్ ప్రారంభ కార్యక్రమంలో ఎస్‌హెచ్ నీరజ్ సిన్హా మాట్లాడుతూ 'మంథన్-2021' కోసం బీపీఆర్ డ డీ సంస్థ 20 కీలక సవాళ్లతో కూడిన అంశాల్ని విడుదల చేసిందని అన్నారు. ఇవి మన దేశ యువకులు విస్తృతంగా బయట నుండి ఆలోచించడానికి మరియు మన భద్రతా సంస్థలు ఎదుర్కొంటున్న వివిధ భయపెట్టే సమస్యలను పరిష్కరించడానికి తగిన వినూత్న భావనలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తాయని చెప్పారు. ఈ అంశాలపై కృషి చేసిన సంస్థలు, వ్యక్తులు సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు. ఆయా ఆలోచనలు నచ్చితే, మేము ఆ బృందాలతో కలిసి

పని చేస్తామని తెలిపారు. వాటి అమలుకు కూడా తగిన విధంగా తాము మద్దతు ఇస్తామని ఆయన అన్నారు. ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుధే మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుండి, విద్యార్థులు వివిధ అంశాలలో పని చేయడానికి, పరిష్కారాలు కనుగొనేలా నిజజీవిత సవాళ్లు లేదా సమస్యలను అందించేందుకు ఆసక్తిగా కృషి చేస్తున్నట్టుగా తెలిపారు. వివిధ ఏజెన్సీలకు సహకరించడం ద్వారా అనేక జాతీయ మరియు అంతర్జాతీయ హ్యాకథాన్‌లను నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు మన దేశ కీలక సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. ఆ కోణం నుండి ఈ మంథన్ హ్యాకథాన్ చాలా కీలకమైనదని తాము నమ్ముతున్నామని అన్నారు. ఎందుకంటే ఇది మన జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి ప్రత్యక్షంగా తోడ్పాటును అందిస్తుందని వివరించారు. తాము చేపట్టిన ఈ చొరవలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొంటారని మరియు మన దేశం నుండి ఉత్తమమైన మేథస్సులను మరియు ఆలోచనలను గుర్తించడానికి బీపీఆర్ డ డీ కి సహాయపడుతుందని కూడా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు దశలలో 'మంథన్-2021'..

'మంథన్-2021' రెండు దశలను కలిగి ఉంటుంది. మొదటి దశలో పాల్గొనే వారు.. తాము పరిష్కరించాలనుకుంటున్న సమస్య ప్రకటనల విషయమై స్పందిస్తూ తమతమ భావనలను, ఆలోచనలను సమర్పించనున్నారు. ఈ సమర్పించిన ఆలోచనలను ఈ రంగంలోని నిపుణుల బృందం విశ్లేషిస్తుంది. వినూత్నమైన ఆలోచనలు మాత్రమే గ్రాండ్ ఫినాలే లేదా 2021 నవంబర్ 28 నుండి షెడ్యూల్ చేయబడిన.. 2వ రౌండ్‌కు ఎంపిక చేయబడతాయి. ఈ గ్రాండ్ ఫినాలే సమయంలో ఎంపికై పాల్గొనేవారు తమ భావనలను ప్రదర్శించడానికి మరియు వారి ఆలోచనలు సాంకేతికంగా సాధ్యమేనని, మరింత ముఖ్యంగా అమలు చేయగలిగినవేనని కార్యక్రమం జ్యూరీలకు నిరూపించడానికి పరిష్కారాలను రూపొందించాల్సి ఉంటుంది.

ఉత్తమ ఆలోచనలను విజేతలుగా ప్రకటించబడతాయి..

మన దేశ నిఘా సంస్థలు ఎదుర్కొంటున్న 21వ శతాబ్దపు భద్రతా సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న భావనలు మరియు సాంకేతిక పరిష్కారాలను గుర్తించడానికి వీలుగా ఈ హ్యాకథాన్ "మంతన 2021" ఒక ప్రత్యేక జాతీయ చొరవ. నవంబర్ 28 నుండి 2021 డిసెంబర్ 1 వరకు షెడ్యూల్ చేయబడిన ఈ 36 గంటల ఆన్‌లైన్ హ్యాకథాన్‌లో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల నుండి ఎంపికైన యువకులు మరియు రిజిస్టర్డ్ స్టార్టప్‌లు తమ సాంకేతిక నైపుణ్యం మరియు వినూత్న నైపుణ్యాలను ఉపయోగించి బలమైన, సురక్షితమైన మరియు సమర్థవంతమైన సాంకేతిక పరిష్కారాలను కనుగొనే విషయంలో పాల్గొంటాయి. విజేత జట్టులకు మొత్తం రూ.40 లక్షలు బహుమతి రుసుము ప్రకటించారు. పార్టిసిపెంట్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, మెషిన్ లెర్నింగ్ మొదలైన కొత్త టెక్నాలజీలను ఉపయోగించి ఈరోజు విడుదల చేసిన 20 విభిన్న ఛాలెంజ్ స్టేట్‌మెంట్‌ల కోసం 6 థీమ్‌ల కింద డిజిటల్ సొల్యూషన్స్‌ని అభివృద్ధి చేసేందుకు వెసులుబాటు ఉంది. ఎప్పటికప్పుడు మారుతున్న భద్రతా సంబంధిత సవాళ్లు, ఇందులో ఫోటో/వీడియో విశ్లేషణ, నకిలీ కంటెంట్ గుర్తింపుతో పాటు సృష్టికర్త, ప్రిడిక్టివ్ సైబర్ క్రైమ్ డేటా అనలిటిక్స్ మొదలైనవి ఉంటాయి. ఈవెంట్‌లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగష్టు 26, 2021 నుండి అధికారిక వెబ్‌సైట్ https://manthan.mic.gov.in లో ప్రారంభమవుతుంది.

# స్టాప్ టీబీ భాగస్వామ్య బోర్డు చైర్ పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవ్య

న్యూఢిల్లీ, ఆగష్టు 27:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవ్య స్టాప్ టిబి భాగస్వామ్య బోర్డు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మంత్రి 2024 వరకు బాధ్యతను నిర్వర్తిస్తారు. 2022 నాటికి యుఎన్ టీబీ లక్ష్యాలను చేరుకోవడానికి స్టాప్ టీబీ భాగస్వామ్య సచివాలయం, భాగస్వాములు, టీబీ సమాజం ప్రయత్నాలకు అయన నాయకత్వం వహిస్తారు. అంతిమంగా 2030 నాటికి టీబీ నిర్మూలించాలనే లక్ష్యంగా మెయిలు రాళ్లను దాటే ప్రయత్నం చేస్తారు.

ఈ సందర్భంగా శ్రీ మాండవీయమాట్లాడుతూ, "స్టాప్ టిబి పార్ట్‌నర్‌షిప్ బోర్డ్ కి నేతృత్వం వహించడం నేను గౌరవంగా భావిస్తాను. ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి ఈ వినాశకరమైన వ్యాధిని అంతం చేయడానికి ప్రపంచ ప్రయత్నాలకు కట్టుబడి ఉన్నాను. స్టాప్ టిబితో పనిచేయడానికి ఆసక్తితో ఉన్నాను." అని అన్నారు. ఈ సందర్భంగా 2025 నాటికి దేశంలో టీబీని అంతం చేయాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు.

ఇప్పటి వరకు స్టాప్ టిబి బోర్డుకు నేతృత్వం వహించిన, మాజీ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ హర్ష వర్ధన్ మార్గదర్శకత్వంలో భాగస్వామ్యం తీసుకున్న కార్యక్రమాలను ప్రశంసించారు.

కొత్తగా నియమితులైన బోర్డ్ ఉపాధ్యక్షుడు శ్రీ. ఆస్టిన్ అరింజ్ ఒబిఫునా, ఆఫ్రో గ్లోబల్ అలయన్స్ యొక్క ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - ఇంతకు ముందు స్టాప్ టిబి పార్ట్‌నర్‌షిప్ బోర్డ్, డెవలపింగ్ కంట్రీ ఎన్‌జిఓలలో అతిపెద్ద నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు కూడా స్టాప్ టిబి భాగస్వామ్యం స్వాగతం పలికింది. అయన 2022 జనవరి 1 నుండి మూడేళ్ల పాటు బోర్డ్ వైస్ చైర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు.

టీబీని తొలగించడానికి భారతదేశ ప్రయత్నాలను గుర్తించిన స్టాప్ టిబి భాగస్వామ్య ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ లూసికా డిటియు, రాబోయే మూడు సంవత్సరాలలో సంస్థను ముందుకు తీసుకెళ్లడంలో కొత్త నాయకత్వానికి ఉన్న అనుభవం, అభిరుచి కీలకమని చెప్పారు.

# గోవాలో విమానయాన మౌలిక సదుపాయాల బలోపేతం కోసం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా లేఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 27:గోవాలో విమానయాన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని అభ్యర్థిస్తూ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డా.ప్రమోద్ సావంత్‌కు పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా లేఖ రాశారు. పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి తగ్గట్లుగా వచ్చే 4-5 ఏళ్లలో దేశంలోని విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణకు రూ.20,000 కోట్లను మంత్రిత్వ శాఖ ఖర్చు చేస్తోంది.

గోవాలో విమానయాన రంగానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టుల అమలుపై ప్రభావం చూపుతున్న వివిధ సమస్యలను శ్రీ సింధియా డా.సావంత్ దృష్టికి తీసుకొచ్చారు. గోవా విమానాశ్రయంలో సిటీ సైడ్ కార్ పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాల కోసం 20.48 ఎకరాలను మంత్రిత్వ శాఖ చాలాకాలం క్రితం కోరిందని లేఖలో పేర్కొన్నారు. భూ సేకరణ వ్యయాన్ని కూడా కేంద్ర మంత్రిత్వ శాఖ గోవా ప్రభుత్వానికి చెల్లించింది. అయితే, 15.50 ఎకరాల భూ సేకరణకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. అందులోనూ 9.23 ఎకరాలు ఇంకా మంత్రిత్వ శాఖకు అప్పగించలేదు.

# రూ.100 కోట్లతో అయిటిపాముల లిఫ్ట్ : ఎమ్మెల్యే చిరుమర్తి



నల్లగొండ, ఆగష్టు 27:: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయని, రిజర్వాయర్ నీటితో రైతుల పంట పొలాలు సస్యశామలమవుతాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యఅన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలం అయిటిపాముల చెరువు నుంచి దిగువ ప్రాంతానికి నీటిని ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రంలోని సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.

రైతులకు రైతు బీమా, రైతు బంధు, ప్రాజెక్ట్‌ల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఎస్ఎల్ బీసీ కాలువ ద్వారా వచ్చిన నీటిని రైతులు పంటల సేధ్యానికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలువ ద్వారా నకిరేకల్, కేతపల్లి మండలాల్లోని కుంటలు, చెరువులను నింపి రైతులను ఆదుకుంటామన్నారు.

కార్యక్రమంలో కట్టంగూర్ జెడ్పీటీసీ తలార బలరాం, నకిరేకల్ జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి , మార్కెట్ కమిటీ చైర్మన్ నడికుడి ఉమరాణి, మారం వెంకట్ రెడ్డి, మురారి శెట్టి కృష్ణ మూర్తి, నూక సైదులు, మంగినపల్లి రాజు, చౌగోనీ నాగరాజు, నర్సింగ్ రవి, సాయి తదితరులున్నారు.

# ఆగస్టు 29 న ఫిట్ ఇండియా మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించనున్న క్రీడా మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:ఫిట్ ఇండియా ఉద్యమం రెండవ వార్షికోత్సవం మరియు ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా29 ఆగస్టు 2021 న యువజన వ్యవహారాలు క్రీడల శాఖల మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ ఫిట్ ఇండియా మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ ఆవిష్కరణ ఢిల్లీలోని ప్రముఖ మేజర్‌లో జరుగుతుంది. యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ సహాయ మంత్రి,శ్రీ నిసిత్ ప్రామాణిక్ కూడా కార్యక్రమంలోపాల్గొంటారు.

వర్చువల్ విధానంలో భారత హాకీ జట్టు కెప్టెన్ మన్ ప్రీత్ సింగ్, రెజ్లర్ సంగ్రామ్ సింగ్, అయాజ్ మెమన్, పాఠశాల విద్యార్థి కెప్టెన్ అనీ దివ్య, ఒక గృహిణి కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించిన తర్వాత ఫిట్ ఇండియా యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలన్న అంశాన్ని ప్రదర్శిస్తారు.

ఫిట్ ఇండియా యాప్ ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంటుంది. ప్రాథమిక స్మార్ట్‌ఫోన్‌లలో కూడా పనిచేసేలా ఈ యాప్ ను ను అభివృద్ధి చేశారు.

ప్రారంభ వేడుకను ఫిట్ ఇండియా ఫేస్‌బుక్ పేజీలో లైవ్‌లో చూడవచ్చు. ఆగస్టు 29 నుంచి గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ ద్వారా యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని 29 ఆగష్టు 2019 న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. భారతదేశాన్ని శారీరకంగా, ఆరోగ్య పరంగా దృఢంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కార్యక్రమం ప్రారంభం అయ్యింది. గత రెండు సంవత్సరాలుగా ఫిట్ ఇండియా అనేక కార్యక్రమాలను నిర్వహించింది. ఫిట్ ఇండియా స్కూల్ వీక్, ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్, ఫిట్ ఇండియా సైక్లోథాన్ లాంటి కార్యక్రమాల్లో అనేక లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు.

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' ఉత్సవాల్లో భాగంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 2.0 ని ఫిట్ ఇండియా నిర్వహిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం'ఆజాది కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది.

# స్వాతంత్ర్య సమర యోధులను స్ఫూర్తిగా తీసుకొని నూతన భారతావనికి మనం కృషి చేయాలి-డాక్టర్ అరుణ పావటి



న్యూఢిల్లీ, ఆగష్టు 27: స్వాతంత్ర్య సమర యోధులను స్ఫూర్తిగా తీసుకొని నూతన భారతావనికి మనం కృషి చేయాలని శ్రీమతి డాక్టర్ అరుణ పావటి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉ హెడ్ డిపార్ట్ మెంట్ ఆఫ్ హిస్టరీ, యూనివర్సిటీ కాలేజ్ ఫర్ ఉమెన్ అన్నారు.

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి), రీజినల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్వోబి) సంయుక్తంగా ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన "భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణా పాత్ర" అనే అంశంపై నిర్వహించిన వెబినార్ లో శ్రీమతి డాక్టర్ అరుణ ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ భారతదేశాన్నిపరాయి పాలన నుంచి విముక్తి చేయడానికి ఎందరో మహానుభావులు వారి జీవితాలను అర్పించారని, వారి త్యాగాల పునాదుల మీదనే ఈ రోజు మనం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం అనే ఫలాలను అనుభవిస్తున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె " 1757 నుండి 1947 మధ్యకాలం లో భారత స్వాతంత్ర్యోద్యమం సమయంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధులు చేసిన అవిరళ కృషిని ఆమె వివరించారు.

స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించి వివిధ ఘట్టాలను వివరిస్తూ, అలనాటి ఉద్యమంలో తెలుగుపత్రికలు చేసిన కృషిని, గ్రంథాలయ ఉద్యమానికి సంబంధించిన విషయాలను తెలియజేశారు.

దేశ స్వాతంత్ర్య సాధన కోసం జరిగిన 190 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో తెలంగాణ ప్రాంతం నుంచి తురేబాజ్ ఖాన్, స్వామి రామానందతీర్థ, మాడపాటి హుమంతరావు, వందే మాతరం రామచంద్ర రావు, బూర్గుల రామకృష్ణా రావు, కె.వి. రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి లాంటి మహనీయులు వివిధ పోరాటాలకు నాయకత్వం వహించారని వివరించారు. హైదరాబాద్ లో 1892లో ఆర్య సమాజ స్థాపనతో తెలంగాణ ప్రాంతం లో స్వాతంత్ర్య ఉద్యమాలకు బీజం పడిందని తెలిపారు. ఆర్య సమాజం ప్రధానంగా సామాజికంగా, సాంస్కృతికంగానూ ప్రజలను చైతన్య వంతులను చేయటానికి కృషి చేస్తూ, ప్రజలలో జాతీయ భావాన్ని పెంపొందించడంలో రాజకీయ చైతన్యం కల్పించటంలో కీలకపాత్ర నిర్వహించిందని తెలిపారు. నిజాం ప్రభుత్వం ఆర్య సమాజంను నిషేధించినా లెక్కచేయకుండా కేశవరావు కొరాట్కర్ లాంటి నాయకులు పలు విద్యాసంస్థలు, గ్రంథాలయాలు స్థాపించి విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. నిషేధించిన కార్యకలాపాలు కూడా కొనసాగిస్తున్నారని కొందరు ఆర్య సమాజ నాయకులను నిజాం ప్రభుత్వం అరెస్ట్ చేసిందని, దీనికి నిరసనగా 1938 అక్టోబర్ 24 న దేశవ్యాప్తంగా సత్యాగ్రహం నిర్వహించారని, ఈ రోజు హైదరాబాద్ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో నిలిచి పోయిందన్నారు. అంతే కాకుండా తెలుగు ప్రజలు సంఘటితమై స్థాపించిన ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభ గురించి పలువిశేషాలు, ప్రముఖ సంఘ సేవకురాలు స్త్రీ జనోద్ధరణ కోసం దుర్గాబాయి దేశ్ ముఖ్ స్థాపించిన ఆంధ్ర మహిళా సభ ప్రాముఖ్యతను ఆమె వివరించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వావిరాల రామచంద్రరావు నిజాం సంస్థానాన్ని భారతదేశం విలీనం చేయడానికి చేసిన కృషికి గాను ఈయనని వందేమాతరం పేరుతో గౌరవిస్తూ వస్తున్నామని ఆమె తెలిపారు.

ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సందర్శనీయ వారోత్సవాలను( 'ఐకానిక్ వీక్') పురస్కరించుకొని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాంతీయ స్వాతంత్ర్య సమరయోధుల ప్రాముఖ్యతను తెలియచేయడానికి ఈ వెబినార్ ను ఏర్పాటు చేసినట్లు శ్రీమతి శృతి పాటిల్, డైరెక్టర్ (ఆర్.ఓ.బి, పి.ఐ.బి) తన ప్రారంభోపన్యాసం లో తెలిపారు.

# ముదిరాజ్‌ల మద్దతు టీఆర్ఎస్‌కే..



హన్మకొండ, ఆగష్టు 27:: హుజూరాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది. నియోజకవర్గం పరిధిలోని కమలాపూర్ మండలం అంబాల గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు టీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు మండల ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో ప్రకటించారు. రానున్న ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గెల్లు శ్రీనివాస్ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని ప్రకటించారు

# ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి సిస్కో తో కలిసి పనిచేస్తున్న నీతీ ఆయోగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలకు సహకారం అందించడానికి సిస్కో తో కలసి నీతీ ఆయోగ్ ' వెప్ నెక్స్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. మహిళలకు సాధికారత కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న నీతీ ఆయోగ్, సిస్కోలు మహిళా వ్యవస్థాపకత వేదిక (డబ్ల్యుఈపీ)ను ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా మహిళల ఆధ్వర్యంలో మరిన్ని వ్యాపార సంస్థలు ప్రారంభం అయ్యేలా చూడడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడానికి డబ్ల్యుఈపీ నెక్స్ పేరిట తాజాగా ప్రారంభించాయి. దేశంలో అంకుర సంస్థల నిర్వహణ ప్రారంభంలో సిస్కో సాధించిన అనుభవాన్ని నీతీ ఆయోగ్ మహిళలకు అందించి వారిని ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తుంది.' వెప్ నెక్స్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమితాబ్ కాంత్ (సీఈఓ నీతీ ఆయోగ్), అన్నా రాయ్ (సీనియర్ సలహాదారు నీతీ ఆయోగ్), మార్టినెజ్ ( సిస్కో, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ), డైసీ చిట్టిలపిల్లి (ప్రెసిడెంట్, సిస్కో ఇండియా అండ్ సార్క్) హరీష్ కృష్ణన్, (పబ్లిక్ అఫైర్స్ అండ్ స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ , సిస్కో ఇండియా మరియు సార్క్) పాల్గొన్నారు.

2017లో నీతీ ఆయోగ్ డబ్ల్యుఈపీ ని ప్రారంభించింది. విభిన్నమైన నేపథ్యాలు కలిగిన మహిళలను ఒకచోట చేర్చి వారికి అవసరమైన వనరులు, సహకారం, శిక్షణ అందించాలనే లక్ష్యంతో డబ్ల్యుఈపీ తొలి ఏకీకృత పోర్టల్ గా పనిచేస్తుంది. ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడానికి డబ్ల్యుఈపీ నెక్స్ ను ప్రారంభించారు. మహిళా పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలకు అవసరమైన సౌకర్యాలు, సహకారంపై నీతీ ఆయోగ్ అధ్యయనం నిర్వహించింది. సామాజిక సహకారం, నైపుణ్యం, అంకుర సంస్థల స్థాపన, వాటి అభివృద్ధి అంశాలతో పాటు వారికి అవసరమైన ఆర్థిక, మార్కెటింగ్ సహకారం కోసం డబ్ల్యుఈపీ నెక్స్ తోడ్పాటు అందిస్తుంది. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సహకారం అందించడానికి కార్యకమాలను రూపొందించి అమలు చేయడం జరుగుతుంది.

వ్యకిగతంగా సంస్థాపరంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి నాస్కామ్ ఫౌండేషన్, సత్వ కన్సల్టింగ్ మరియు డీఅస్రా ఫౌండేషన్‌తో కలిసి సిస్కో సాంకేతికత-ఆధారిత సహకారాన్ని అందించి వారి పురోభివృద్ధికి సహకరిస్తుంది.

"ఆరవ ఆర్థిక గణన ప్రకారం దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల శాతం కేవలం 13.76% మాత్రమే. మొత్తం 58.5 మిలియన్ల మంది పారిశ్రామికవేత్తలలో 8.05 మిలియన్ల మంది మహిళలు ఉన్నారు. ఇది గతం. ప్రస్తుతం భారత ప్రభుత్వం మరియు ప్రైవేట్ రంగం డబ్ల్యుఈపీ వంటి కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సహకారం వల్ల వీరి సంఖ్య పెరుగుతుంది. పురుషులతో సమానంగా మహిళలు అభివృద్ధి సాధించి నూతన భారత దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తారు.' అని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ అన్నారు. " డబ్ల్యుఈపీ నెక్స్ వల్ల ఈ కార్యక్రమం మరింత వేగంగా అమలు జరుగుతుంది. సిస్కోతో కలసి ప్రారంభించిన ఈ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ త్వరలో దేశంలోని ప్రతి మహిళా పారిశ్రామికవేత్త తన కలలను సాకారం చేసుకోవడానికి సహకరిస్తుంది' అని ఆయన అన్నారు.

సిస్కో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మరియా మార్టినెజ్ మాట్లాడుతూ నీతీ ఆయోగ్ తో కలిసి మహిళా సాధికారతకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని అన్నారు. లింగ వివక్ష లేకుండా సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన చెప్పారు. అడ్డంకులను అధిగమిస్తూ, నూతన ఆలోచనలు సాంకేతికతతో మహిళలు అభివృద్ధి సాధించడానికి డబ్ల్యుఈపీ ఉపయోగపడుతుందని అన్నారు.

ఎక్కువ మంది మహిళలు వాణిక్య, పారిశ్రామిక రంగంలోకి ప్రవేశిస్తే 2030 నాటికి కొత్తగా 170 మిలియన్ ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చి దేశ జీడీపీ 1.5% పెరుగుతుందని ఒక అధ్యయనంలో వెల్లడయ్యిందని సిస్కో ఇండియా సార్క్ మేనేజింగ్ డైరెక్టర్ , చీఫ్ పాలసీ ఆఫీసర్ హరీష్ కృష్ణన్ వివరించారు. డబ్ల్యుఈపీ నెక్స్ ద్వారా దేశంలో మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని ఆయన చెప్పారు.

సిస్కో గురించి

ప్రపంచ ఇంటర్నెట్ నిర్వహణలో సిస్కో (ఔయాఆంఖి: ఊఆూ) ప్రపంచ అగ్రగామి సంస్థ గా గుర్తింపు పొందింది. అనువర్తనాలను పునర్నిర్మించడం ద్వారా, డేటాను భద్రపరచడం, మౌలిక సదుపాయాలను మార్చడం బృందాలను ప్రపంచ మరియు సమగ్ర భవిష్యత్తు కోసం శక్తివంతం చేయడం ద్వారా నూతన అవకాశాలనుసిస్కో కల్పిస్తుంది. మరిన్ని సిస్కో వివరాల కోసం అతిబఞనీ.ఈనీఏ ఎలితిబిబివతీ ఏఅతిబఞనీ లో చూడవచ్చును.

నీతీ ఆయోగ్ మహిళా వ్యవస్థాపక వేదిక గురించి

(చిఇఖ) అనేది నీతి ఆయోగ్ ప్రధాన కార్యక్రమంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫాం అమలు జరుగుతున్నది. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా సమాచార పోర్టల్ గా దీనిని రూపొందించారు. ఇది పరిశ్రమ సంబంధాలను మెరుగుపరచడానికి అమలు జరుగుతున్న పథకాలు మరియు సేవలపై అవగాహన కల్పించి అవసరమైన సహకారాన్ని అందించి శిక్షణా కార్యకమాల నిర్వహణ , నిధుల సేకరణ అవకాశాలను అందుబాటులోకి తెస్తుంది. మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించిన సమాచారం మరియు సేవలకు వేదికగా పనిచేస్తుంది. దీనిలో ప్రస్తుతం 16,000 మంది రిజిస్టర్డ్ యూజర్లు మరియు 30 మంది భాగస్వాములు ఉన్నారు. ప్రధానంగా ఫండింగ్ , ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఇంక్యుబేషన్ కనెక్ట్‌లు, టాక్సేషన్ , కాంప్లయన్స్ సపోర్ట్, ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్లింగ్, మెంటర్‌షిప్, కమ్యూనిటీ , నెట్‌వర్కింగ్ మరియు మార్కెటింగ్ అసిస్టెన్స్ అంశాలపై ఇది సహకారం అందిస్తుంది.

# "లడాఖ్: కొత్త ప్రారంభం, కొత్త లక్ష్యాలు" అనే శీర్షికతో 'లే' లో ప్రారంభమైన - మూడు రోజుల మెగా టూరిజం ఈవెంట్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:"లడాఖ్ : కొత్త ప్రారంభం, కొత్త లక్ష్యాలు" అనే శీర్షికతో లే లో ఈ రోజు ప్రారంభమైన మెగా టూరిజం ఈవెంట్ లో, లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ రాధా కృష్ణ మాథుర్; కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి (డి.ఓ.ఎన్.ఈ.ఆర్) శాఖల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రసంగించారు. శ్రీ జి. కిషన్ రెడ్డి దృశ్య మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లడాక్ ప్రాంత సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించి, రూపొందించిన "లడాఖ్ కోసం ఒక పర్యాటక విజన్" అనే పత్రాన్ని ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. సుస్థిరమైన పర్యావరణ పద్ధతుల నేపథ్యంలో పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానికంగా అందుబాటులో ఉండే వస్తు సామాగ్రి, మానవ వనరుల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో – లడాఖ్ పార్లమెంట్ సభ్యుడు శ్రీ జమ్యాంగ్ ట్సెరింగ్ నాంగ్యాల్; లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంత పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి శ్రీ కె మెహబూబ్ అలీ ఖాన్; భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, శ్రీ అరవింద్ సింగ్ తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

లడాఖ్ కేంద్రపాలిత ప్రాంత పర్యాటక శాఖ మరియు అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏ.టి.ఓ.ఏ.ఐ) సహకారంతో, "లడాఖ్: కొత్త ప్రారంభం, కొత్త లక్ష్యాలు" అనే శీర్షికతో, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ, ఈ కార్యక్రమాన్ని, 2021 ఆగష్టు 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహిస్తోంది. సాహసం, సంస్కృతి మరియు బాధ్యతాయుతమైన పర్యాటక అంశాలపై దృష్టి సారించి లడాఖ్‌ని ఒక పర్యాటక ప్రాంతంగా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. పరిశ్రమ వాటాదారులకు స్వదేశీ ఉత్పత్తి పరిజ్ఞానాన్ని అందించడం, దేశంలోని ఇతర ప్రాంతాల నుండి టూర్ ఆపరేటర్లు / కొనుగోలుదారులతో పరస్పర చర్య కోసం స్థానిక వాటాదారులకు ఒక వేదికను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ రాధాకృష్ణ మాథుర్ మాట్లాడుతూ, సందర్శకులకు లడాఖ్ అందించే, శీతాకాల పర్యాటకం, సైన్స్ ఆధారిత పర్యాటకం మొదలైన కొత్త పర్యాటక ఉత్పత్తులు/సదుపాయాల గురించి తెలియజేశారు. లడఖ్ సందర్శించే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి సాంస్కృతిక మరియు వారసత్వ పర్యాటకం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని, శ్రీ మాథుర్, చెప్పారు. లడాఖ్ కోసం అనుసరిస్తున్న కర్బన తటస్థ విధానం గురించి కూడా శ్రీ మాథుర్, ఈ సందర్భంగా, ప్రస్తావించారు. బౌద్ధ మార్గాన్ని అనుసరించడం లడాఖ్ యొక్క సహజమైన, ప్రత్యక్ష సాంస్కృతిక వారసత్వంగా గుర్తించినట్లు యునెస్కో పేర్కొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఆయన కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖను, అభినందించారు.

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి (డి.ఓ.ఎన్.ఈ.ఆర్) శాఖల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి, దృశ్యమాధ్యమం ద్వారా ప్రసంగిస్తూ, గత 40 సంవత్సరాలలో లడాఖ్ లో పర్యాటకం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని పేర్కొన్నారు. లడాఖ్ 'ల్యాండ్ ఆఫ్ హై పాసెస్" గా పేరుగాంచిందనీ, ప్రకృతి అందాల ఆనందం నుండి ట్రెక్కర్లు, బైకర్లు, సైక్లిస్టులు, అధిరోహకులు మొదలైన వారికి సాహస అవకాశాల వరకు ప్రతి పర్యాటకులకు ఏదో ఒక మంచి అనుభూతిని కలుగచేస్తుందనీ, ఆయన చెప్పారు. అదే సమయంలో, హేమిస్, ఆల్చి, తిక్సే మఠాలు లడాఖ్ ను ఒక సాంస్కృతిక మరియు వారసత్వ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాయి. లడాఖ్ యొక్క భారీ పర్యాటక సామర్థ్యాన్ని పెంచడానికి, పర్యాటక మంత్రిత్వ శాఖ 'లడాఖ్: నూతన ప్రారంభం నూతన లక్ష్యాలు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందనీ, ఇది దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన టూర్ ఆపరేటర్లు, వినియోగదారులు, లడాఖ్ కు చెందిన స్థానిక భాగస్వాములతో సంప్రదింపులు జరిపే వేదికగ వ్యవహరిస్తుందని కూడా కేంద్రమంత్రి పేర్కొన్నారు. లడాఖ్ లో టూరిజం అభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాలు వివరంగా తెలియజేసే విధంగా, పర్యాటక మంత్రిత్వ శాఖ ఈ 'లడాఖ్ విజన్ డాక్యుమెంట్' ను సిద్ధం చేసిందని శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం టూరిస్ట్ వాటర్ స్క్రీన్ ప్రొజెక్షన్ మల్టీమీడియా షోతో పాటు ఇతర పర్యాటక ఆకర్షణల కోసం 23.21 కోట్ల రూపాయలు సమకూర్చింది, చౌకి హేంగ్ విహారా ప్రాజెక్టును ప్రసాద్ (పి.ఆర్.ఏ.ఎస్.హెచ్.ఏ.డి) పథకం కింద అభివృద్ధి చేసింది. లడాఖ్ వంటి ప్రదేశాలలో పర్యాటకం కోసం కమ్యూనిటీ పార్టనర్ షిప్‌ను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యం అని ఆయన తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వృత్తి నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని సృష్టించడంపై దృష్టి సారించడంతో పాటు మొత్తం పర్యాటక అభివృద్ధిని పెంపొందించాల్సిన అవసరాన్ని శ్రీరెడ్డి నొక్కి చెప్పారు. భారతదేశంలో పర్యాటక రంగం ఒక అతిపెద్ద ఉపాధి సృష్టికర్తల్లో ఒకటని, మంత్రి పేర్కొన్నారు. సేవల పరిశ్రమ లోని 12 ఛాంపియన్ సెక్టార్ లలో పర్యాటకం ఒకటిగా ప్రధానమంత్రి అభివర్ణించారని ఆయన తెలియజేశారు.

లడాఖ్ పార్లమెంటు సభ్యుడు శ్రీ జమ్యాంగ్ ట్సెరింగ్ నామ్‌గ్యాల్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం లడాఖ్ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు, ఈ కేంద్రపాలిత ప్రాంత ఆర్థిక వ్యవస్థను కూడా పెంపొందిస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో స్థిరమైన, బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ఎలా సృష్టించవచ్చో, ఈ కార్యక్రమం తెలియజేసిందని, ఆయన అన్నారు. లడఖ్ ను టూరిజం కోసం ఏడాది పొడవునా గమ్యస్థానంగా మార్చాలనే తమ ఆలోచనను పంచుకుంటూ, లడఖ్ లో శీతాకాల పర్యాటకం, మరియు శీతాకాలపు క్రీడల సామర్థ్యాన్ని, శ్రీ నామ్ గ్యాల్, నొక్కి చెప్పారు. ఒక నెల వ్యవధిలో జన్ స్కార్ వింటర్ టూరిజం ఫెస్టివల్ మరియు వింటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ నిర్వహించాలని ఆయన నొక్కిచెప్పారు. కార్గిల్ లో కూడా పర్యాటకాన్ని పెంపొందించాలని, ఆయన కోరారు.

సాహస క్రీడలకు లడాఖ్ స్వర్గం లాంటిదని, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, శ్రీ అరవింద్ సింగ్ అభివర్ణించారు. ఇక్కడ గట్టిగా ఉండే భూ భాగం; ప్రవహించే నదులు, ట్రెక్కింగ్, రివర్ రాఫ్టింగ్, క్యాంపింగ్, పర్వతారోహణ, బైకింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహించడానికి మరిన్ని అవకాశాలను కల్పిస్తాయి. లడాఖ్ ప్రాంత ఆర్థిక వ్యవస్థలో టూరిజం కీలక పాత్ర పోషిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి ప్రపంచాన్ని ప్రభావితం చేసిందని శ్రీ అరవింద్ అన్నారు. ఏదేమైనా, రికవరీ సంకేతాలు కనిపించడం శుభ సూచకం. ఈ రికవరీ దశలో లడాఖ్ ప్రధాన కదలికలలో ఒకటిగా ఉంది, దీనితో పాటు అత్యంత ఇష్టపడే గమ్యస్థానాలలో లడాఖ్ ఒకటిగా నిలిచింది. శ్రీ అరవింద్ ఇంకా మాట్లాడుతూ, మేము పర్యాటకాన్ని పునః ప్రారంభించినప్పుడు, మంత్రిత్వ శాఖ కోవిడ్-19 భద్రత మరియు పరిశుభ్రత మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా హాస్పిటాలిటీ ఇండస్ట్రీ లో అంచనా, అవగాహన మరియు శిక్షణ కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఎస్.ఏ.ఏ.టి.హెచ్.ఐ. వ్యవస్థ కింద, ఇంతవరకు, 10,000 కంటే ఎక్కువ వసతి యూనిట్లు నమోదు చేయడం జరిగింది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో లడఖ్‌పై ఒక ప్రత్యేక వెబినార్ నిర్వహించిన పర్యాటక మంత్రిత్వ శాఖ "దేఖో అప్నా దేశ్ వంటి వివిధ ప్రచారాలు మరియు కార్యక్రమాల ద్వారా లడాఖ్ ను ప్రోత్సహిస్తోంది.

లడాఖ్ కేంద్రపాలిత ప్రాంత పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి శ్రీ కె. మెహబూబ్ అలీ ఖాన్ మాట్లాడుతూ, "లడాఖ్ కోసం ఒక టూరిజం విజన్" పత్రాన్ని రూపొందించినందుకు, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతం కోసం ఒక పర్యాటక విధానాన్ని ఖరారు చేయడంలో ఈ పత్రం సహాయపడుతుందని కూడా ఆయన చెప్పారు. గణాంకాల ప్రకారం లడాఖ్ జి.డి.పి. లో 50 శాతం పర్యాటక రంగంపై ఆధారపడి ఉందనీ, ఈ ప్రదేశానికి దాని స్వంత విశిష్టత ఉందనీ, శ్రీ మెహబూబ్ అలీ ఖాన్ పేర్కొన్నారు. లడాఖ్ లో పర్యాటక విధానం కోసం నిపుణులైన కన్సల్టెంట్లను నియమించుకుంటామనీ, త్వరలో లడఖ్ లో టూరిజం పాలసీ వస్తుందని, ఆయన చెప్పారు.

లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్ సలహాదారుడు, శ్రీ ఉమాంగ్ నరూలా, మాట్లాడుతూ, విజన్ డాక్యుమెంట్ తయారు చేసినందుకు, పర్యాటక మంత్రిత్వ శాఖను, అభినందించారు. కేంద్ర పాలిత ప్రాంతం కోసం పర్యాటక విధానాన్ని ఖరారు చేయడానికి, ఈ విజన్ డాక్యుమెంట్, మంచి ఆధారాన్ని అందిస్తుంది. లడక్ ఒక పర్యాటక విధానాన్ని కలిగి ఉండటం చాలా ముఖ్యం. వివిధ కేంద్ర పథకాల ద్వారా సహాయం అందిస్తున్నందుకు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖకు కూడా శ్రీ నరూల కృతజ్ఞతలు తెలిపారు. శీతాకాల పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, సున్నితమైన విధానంలో హోమ్‌స్టేను ఏర్పాటు చేశామనీ, అదేవిధంగా, శీతాకాల సమావేశాన్ని కూడా నిర్వహించామని ఆయన, చెప్పారు. బాధ్యతాయుతమైన టూరిజం కోసం స్వీయ నియంత్రణను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కూడా, ఆయన సూచించారు.

ఉత్తమ విలువలతో, తక్కువ ప్రభావం గల పర్యాటక గమ్యస్థానంగా లడాఖ్ ను ప్రోత్సహిస్తూ, స్థానిక సమాజానికి స్థిరమైన మరియు సమగ్ర వృద్ధిని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో "విజన్ డాక్యుమెంట్" ను రూపొందించడం జరిగింది. పర్యాటక పరిశ్రమ యొక్క వాటాదారుల అంచనాలతో పాటు స్థానిక జనాభా, వారి ఆర్థిక, సామాజిక అవసరాలను ఈ "విజన్ డాక్యుమెంట్" ప్రతిబింబిస్తుంది. సౌలభ్యం మరియు అనుభవాన్ని మెరుగుపరచడానికి ఉత్తమ అభ్యాసాలను సమగ్రపరచడం ద్వారా, ప్రపంచంలోని ఉత్తమ ప్రదేశాలతో పోల్చదగిన పర్యాటక అనుభవాలను లడాఖ్ లో సృష్టించడమే ఈ డాక్యుమెంట్ లక్ష్యం. డాక్యుమెంట్ లోని సూచనలు నియంత్రించబడిన, పర్యవేక్షించబడిన పర్యాటకం ద్వారా స్థానిక పర్యావరణం పైన కానీ, జనాభా పైన కానీ, పర్యాటకం వల్ల ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండదు. లడాఖ్ లో పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా, స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు, లడాఖ్ సంస్కృతి, ఉత్పత్తులను భారతదేశం మరియు ప్రపంచం నలుమూలల నుండి వచ్చే పర్యాటకులకు పరిచయం చేసి, ప్రోత్సహించాలని, ఈ డాక్యుమెంట్ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రారంభ సదస్సు అనంతరం నిర్వహించిన ప్యానెల్ చర్చల్లో – అభివృద్ధి, అనుసంధానత, మౌలిక సదుపాయాలు, స్థిరమైన, కమ్యూనిటీ ఆధారిత అభివృద్ధి కోసం కొత్త ప్రాంతాలపై దృష్టి సారించి లడఖ్‌లో పర్యాటక సమగ్ర అభివృద్ధి; "లే" లో అడ్వెంచర్ టూరిజం యొక్క అవకాశాలు మరియు సవాళ్లు; హోమ్-స్టే టూరిజం ద్వారా కొత్త ప్రాంతాలను గుర్తించే అవకాశం ఉండడంతో, స్థానిక సమాజంతో పాటు మహిళలకు సాధికారత కల్పించడంలో హోమ్-స్టే టూరిజం పోషించిన పాత్ర వంటి వివిధ అంశాలపై చర్చ జరిగింది.

భారతదేశంలో పర్యాటక రంగం మొత్తం అభివృద్ధిలో దేశీయ పర్యాటకం ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వివిధ ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. పర్యాటక గమ్యస్థానాలు, ఉత్పత్తుల గురించి అవగాహన పెంచడంతో పాటు, ఈశాన్య ప్రాంతం, కేంద్రపాలిత ప్రాంతం లడాఖ్, కేంద్రపాలిత ప్రాంతం జమ్మూ-కశ్మీర్ వంటి ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించి దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా, ఈ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

కోవిడ్-19 మహమ్మారి ఇంతకూ ముందెన్నడూ లేని విధంగా ప్రపంచాన్ని ప్రభావితం చేసింది, స్తంభింపచేసింది. ఏదేమైనా, కోలుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ప్రజల రాకపోకలు ప్రారంభమయ్యాయి . దేశీయ టూరిజం విభాగంలో సందర్శకుల రద్దీ క్రమంగా పెరుగుతోంది. విమాన, రైలు, రహదారి మార్గాల్లో, ప్రయాణీకుల రద్దీ క్రమంగా పెరుగుతోంది. పరిశ్రమ వాటాదారుల భాగస్వామ్యంతో మంత్రిత్వ శాఖ కూడా వేగంగా పర్యాటకాన్నిప్రోత్సహించడం ప్రారంభించింది. జాతీయ , అంతర్జాతీయ మార్కెట్లలో లడాఖ్ పై ఒక ప్రత్యేక వెబినార్‌లో నిర్వహించిన, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, "దేఖో-అప్నా-దేశ్" వంటి వివిధ ప్రచారాలు మరియు కార్యక్రమాల ద్వారా లడఖ్‌ను ప్రోత్సహిస్తోంది. "ఇన్‌క్రెడిబుల్ ఇండియా" వెబ్-సైట్, మంత్రిత్వ శాఖకు చెందిన సామాజిక మాధ్యమ వేదికలు, ప్రకటనల ముద్రణ మొదలైన వాటి ద్వారా కూడా లడాఖ్ ప్రాంతంపై ప్రచారం కొనసాగుతోంది.

అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు; టూర్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, దౌత్యవేత్తలు, హోమ్‌స్టే యజమానులు, భారత ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారులు, లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంత సీనియర్ అధికారులు, మీడియా ప్రతినిధులతో కలిపి మొత్తం సుమారుగా 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పర్యాటక ఉత్సవంలో భాగంగా – లడాఖ్ లో అందుబాటులో ఉండే పర్యాటక సౌకర్యాలు, పర్యాటక ఉత్పత్తులను తెలియజేసే విధంగా ఎగ్జిబిషన్, ప్యానెల్ చర్చలు, బి-2-బి సమావేశాలు, సాంకేతిక పర్యటనలు, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి అనేక కార్యక్రమాలు ఉంటాయి.

# హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం..

హన్మకొండ, ఆగష్టు 27:: వరంగల్‌ను హైదరాబాద్ మహానగరం తరహాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వరంగల్‌లోని జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న సింథటిక్ ట్రాక్ పనులను మంత్రులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక స్టేడియం నిర్మిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్నిరంగాల్లో పురోగతి సాధిస్తున్నదని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నదని చెప్పారు.

తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలను గెలుస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ కృషివల్లే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు దక్కిందని చెప్పారు. గత ప్రభుత్వాలు క్రీడలను పట్టించుకోలేదని విమర్శించారు. మంత్రి కేటీఆర్ వరంగల్ నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చి దిద్దుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. జేఎన్ఎస్ స్టేడియంలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని చెప్పారు.

# టీఆర్ఎస్ నేత రూప్‌సింగ్ కుమార్తె వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్



కరీంనగర్ ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): సీఎం కేసీఆర్ కరీంనగర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా అలుగునూర్‌లో టీఆర్ఎస్ కార్మిక నేత రూప్‌సింగ్ కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. నూతన వధూ వరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో మంత్రులు సత్యవతి రాథోడ్, హరీశ్ రావు, కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ కరీంనగర్ చేరుకుంటారు. దళితబంధు పథకం అమలుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. దళితబంధు పథకంలో భాగంగా హుజూరాబాద్‌లోని 20,929 దళిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించనున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రారంభించిన ఈ పథకానికి నిధుల కేటాయింపు కూడా జరిగిన విషయం తెలిసిందే. దళితబంధు నిధులు రూ.2 వేల కోట్లు ఇప్పటికే కలెక్టర్ ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. ఈ నేపథ్యంలో దళితబంధుపై సీఎం కేసీఆర్ కరీంనగర్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు హరీశ్?రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్‌తో పాటు ఏడుగురు డిప్యూటీ కలెక్టర్లు హజరుకానున్నారు. సమావేశం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

# తాలిపేరు ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తివేత.. జూరాలకు కొనసాగుతున్న వరద

హైదరాబాద్ , ఆగష్టు 27:ఎగువన వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రంలో జలాశయాలకు భారీగా వరద వస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్ట్?కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో అధికారులు ప్రాజెకు మూడు గేట్లు ఎత్తివేశారు. ప్రస్తుతం 4,061 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతున్నది. ఇక ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వచ్చి చేరుతున్నది. జలాశయంలోకి 14,500 క్యూసెక్కుల నీరు వస్తున్నది. అధికారులు 10,521 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.960 మీటర్ల వద్ద నీటి మట్టం ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు. 8.531 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

# 'డబుల్' కాలనీలో మంత్రి తలసాని పర్యటన



హైదరాబాద్ , ఆగష్టు 27: వక్ఫ్‌బోర్డు స్థలంలో పేద ముస్లీం కుటుంబాలకు రెండు పడక గదుల ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫి, మత్స్య, పాడి, పశు సంవర్ధక శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని జీవైఆర్ కాంపౌండ్, పొట్టి శ్రీరాములు నగర్, బండమైసమ్మ నగర్ బస్తీలలోని డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలలో ఆయన పర్యటించారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీమ్, హైద్రాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ ఆర్డీఓ వసంతకుమారిలతో కలసి జీవైఆర్ కాంపౌండ్‌లో స్థలాన్ని పరిశీలించారు.

ముస్లీం శ్మశానవాటిక పక్కన ఉన్న కొంత స్థలం కేటాయిస్తే ఎన్నో ఏండ్ల నుండి నివసిస్తున్న 12 కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేయాలనుకుంటున్నామని మంత్రి శ్రీనివాస్ యాదవ్ చెప్పడంతో వక్ఫ్‌బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ సలీమ్ తెలిపారు. అలాగే, ఆక్కడ ఆలయం నిర్మించే ప్రదేశంలో మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లలను మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు.

పొట్టి శ్రీరాములు నగర్‌లో మరికొందరు లబ్ధిదారుల ఆధారాలను పరిశీలించి వాటిని ధృవీకరించాక ఇండ్లను కేటాయింపు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బండమైసమ్మ నగర్ బస్తీలో మరో అదనపు బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించారు. దీపావళి లోగా ఇండ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాసిల్దార్ బాలశంకర్, కార్పొరేటర్ కె.హేమలత, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ ముకుందరెడ్డి, హౌజింగ్ ఈఈ ఎం.వెంకటదాస్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి

హైదరాబాద్ , ఆగష్టు 27:మియాపూర్ :కష్టకాలంలో ఉన్న పేదలకు అండగా సీఎం సహాయ నిధి పథకం నిలుస్తూ బాధితులకు భరోసాను ఇస్తున్న దని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు.

ఈ పథకంతో వందలాది మంది పేదలు తమ అనారోగ్యాలకు స్వస్థత పొంది హాయిగా జీవితం గడుపుతున్నారన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ఆయా డివిజన్‌లకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ. 1.21 లక్షల చెక్కులను విప్ గాంధీ బుధవారం వివేకానందనగర్‌లోని తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గణేశ్, జిల్లా గణేశ్, ఆదర్శ్‌రెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, నరేశ్, జగదీశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# 'ట్రాన్స్‌ఫర్మేటివ్ మొబిలిటీ' చొరవలో భాగస్వాములు కావాలని రాష్ట్రాలను కోరిన కేంద్ర మంత్రి శ్రీ ఆర్‌కె సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:దేశంలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే ప్రయత్నాలలో భాగంగా.. కేంద్ర విద్యుత్ మరియు నూతన ఉ పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి శ్రీ ఆర్‌కె సింగ్ అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో సహా కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులకు(స్వతంత్ర బాధ్యత) ఒక లేఖ రాశారు. భారత ప్రభుత్వం చేపట్టిన సరికొత్త 'ట్రాన్స్‌ఫర్మేటివ్ మొబిలిటీ' చొరవలో భాగస్వామ్యం కావాలని కోరారు. సంబంధిత మంత్రిత్వ శాఖలు/ డిపార్ట్‌మెంట్‌లు తమ అధికారిక వాహనాల సముదాయాన్ని ప్రస్తుత ఉన్న అంతర్గత దహన యంత్రం (ఐసీఈ)/ పెట్రోల్/ డీజిల్ వాహనాల నుండి ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకోవాలని సూచించారు. ఇకపై ప్రభుత్వపు అన్ని అధికారిక ప్రయోజనాల కోసం ఈ తరహా వాహనాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. ఈ తరహా చర్య దేశంలోని సాధారణ ప్రజలకు ఒక ఉ దాహరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ-మొబిలిటీకి మారడానికి ఈ చర్య ఎంతగానో ప్రోత్సహకరంగా నిలుస్తుందని తాము భావిస్తున్నామని మంత్రి తెలిపారు. బహుళ లక్ష్యాలను చేరుకోవడానికి ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీలు) ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన ఈ-ఎలక్ట్రిక్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ చొరవ నిలుస్తుంది - కర్బన్ ఉద్గారాల తగ్గింపు, ఇంధన భద్రత, ఇంధన సామర్థ్యం పెంపు మొదలైన లక్ష్యాలను సాధించేందుకు గాను ఈ చర్య ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

# మా మల్లారెడ్డికి జోష్ ఎక్కువ: కేటీఆర్

న్యూఢిల్లీ, ఆగష్టు 27:మంత్రి మల్లారెడ్డి టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డికి విసిరిన సవాల్ పై కేటీఆర్ స్పందించారు. మా మల్లా రెడ్డికి జోష్ ఎక్కువ.. ఆవేశంలో మాట్లాడారన్నారని అన్నారు కేటీఆర్. ఇక కేసీఆర్ కాలి గోటికి సరిపోనివారు ఇవాళ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు కేటీఆర్. ఆయన పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడినందుకే.. కొడంగల్ నుంచి తరిమితే.. చావు తప్పి కన్ను లొట్ట బోయినట్లు మల్కాజిగిరిలో గెలిచాడు అంటూ రేవంత్‌రెడ్డిపై సెటైర్లు వేశారు మంత్రి కేటీఆర్. టి.కాంగ్రెస్ ను చంద్రబాబు.. ఫ్రాంచైజీ లెక్క తీసుకున్నాడని.. చిలక మనదే అయినా.. మాట్లాడిస్తున్నది మాత్రం చంద్రబాబే అన్నారు. మల్లారెడ్డి సవాల్ చేసినట్టు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కేటీఆర్.. గజ్వేల్ ఆడా ఈడా ఎందుకు ? అక్కడే తేల్చుకో..! అని సూచించారు. నీ స్థాయి బతుకు ఎంటో అందరికీ తెలుసు.. రేవంత్ ను ముందు పెట్టి చంద్రబాబు నడిపిస్తున్నారు.. బాబు తోలు బొమ్మ ఆటలో బొమ్మ రేవంత్ అంటూ ఎద్దేవా చేశారు.

రాజకీయాలలో అందరూ సంస్కా వంతంగా మాట్లాడాలని కోరుకుంటాం అన్నారు కేటీఆర్.. ఇప్పుడు చంద్రబాబు బినామీ టి.పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్నాడని ఆరోపించిన ఆయన.. వాళ్లు మాట్లాడారు కాబట్టే మేం మాట్లాడుతున్నాం అన్నారు. మరోవైపు.. బండి సంజయ్ పాదయాత్రపై కేటీఆర్ కామెంట్ చేస్తూ.. ఏం చేశారని ప్రజా సంగ్రామ యాత్ర అంటూ ప్రశ్నించారు.. గుజరాత్ కు వరదలు వస్తే కేంద్రం వెయ్యి కోట్లు ఇచ్చింది తెలంగాణకు ఏం ఇవ్వలేదని బండి సంజయ్ చెబుతారా అని నిలదీశారు.. మేం డబుల్ బెడ్ కడతాం అంటే 4,5 ఎకరాలు కేంద్రం ఇవ్వదు కానీ, రైల్వే ఆస్తులను అమ్మకానికి పెట్టిందని మండిపడ్డారు.

# విద్యతోనే పరిపూర్ణ వికాసం : మంత్రి సత్యవతి రాథోడ్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): విద్య ద్వారనే వికాసం సిద్ధిస్తుందని, విద్య అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లాలోని కొనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో బాల, బాలికల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో అదనపు వసతుల కల్పన పనులకు మంత్రి స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేటు స్కూల్స్ లలో చాలామంది పేదలు చదవలేక బడి మధ్యలో మానేస్తున్నారు.

వీరందరికీ కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున గురుకులాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. 6.05 కోట్ల రూపాయలతో డార్మెట్రి బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, హెల్త్ క్లినిక్, పేరెంట్స్ వెయిటింగ్ హాల్, ఇంటర్నల్ సీసీ రోడ్లు, నీటి సరఫరా, పారిశుధ్య వసతులు, అంతర్గత రోడ్ల పనులకు శంకుస్థాపన వేసుకోవడం సంతోషంగా ఉ oదన్నారు. స్కూల్‌కు రోడ్డు సౌకర్యం లేదని తన దృష్టికి వచ్చిందని వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆవె హామినిచ్చారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందిస్తున్నాం. ఇందుకోసం ప్రతిరోజూ గుడ్డు, వారానికి 6 సార్లు చికెన్, మటన్ ఇస్తున్నాం. సీఎం కేసీఆర్ మనవడు, మనుమరాలు తినే సన్నబియ్యం ఇక్కడకూడా మన బిడ్డలకు పెడుతున్నామని తెలిపారు. కరోనా వల్ల కొంతకాలం విద్యా సంస్థలు మూతపడ్డాయి. సెప్టెంబర్ 1 నుంచి మళ్లీ ప్రారంభం అవుతున్నాయి. పాఠశాలలు మళ్లీ ప్రారంభం అవుతున్న సందర్భంగా పిల్లలకు ఇచ్చే అన్ని వసతులు కల్పిస్తున్నాం.

స్థానికులు కూడా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ భాస్కర్, జెడ్పీ చైర్ పర్సన్ అరుణ, గిరిజన గురుకుల సంస్థ అధికారులు విజయలక్ష్మి, జ్యోతి, స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# భారీ డిస్కౌంట్: రూ.30 కోట్ల హెలికాప్టర్ రూ.4 కోట్లకే

న్యూఢిల్లీ, ఆగష్టు 27:రాజస్థాన్ ప్రభుత్వం ఓ హెలికాప్టర్‌ను అత్యంత చౌకగా అమ్మకానికి పెట్టింది. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా వసుంధరా రాజే ఉన్నప్పుడు ఇటలీకి చెందిన అగస్టా వెస్ట్ లాండ్ కంపెనీకి చెందిన ట్విన్ ఇంజిన్ 109 హెలికాప్టర్ ను రూ. 30 కోట్లతో కొనుగోలు చేశారు. ఆమె సీఎంగా ఉన్నప్పుడు అధికార కార్యక్రమాలను ఈ హెలికాప్టర్ ను వినియోగించారు. అయితే అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఓ కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో హెలికాప్టర్ ను అత్యవసరంగా దించేశారు. అప్పటి నుంచి ఈ హెలికాప్టర్‌ను ఎవరూ వినియోగించలేదు. దీంతో అప్పటి నుంచి అది గోడౌన్ లో వృథాగా పడి ఉంది.

ఈ నేపథ్యంలో ఆ హెలికాప్టర్‌ను అమ్మే యాలని రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. అత్యంత ఖరీదుతో పాటు అన్ని భద్రత సదుపాయాలు గల హెలికాప్టర్‌ను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు 12 సార్లు టెండర్లను పిలిచినా కొనేందుకు ఎవరూ రాలేదు. దీంతో ఏకంగా రూ. 26 కోట్ల డిస్కౌంట్ ఇస్తూ? కేవలం రూ.4 కోట్లకే అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరి ఈసారైనా ఎవరైనా కొనేందుకు ముందు వస్తారా? లేదా? అనేది వేచి చూడాలి.

# కరోనా కలకలం : కేరళలో కొనసాగనున్న సండే లాక్‌డౌన్

తిరువనంతపురం, ఆగష్టు 27: కకేరళలో కరోనా కేసుల పెరుగుదల కొనసాగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొవిడ్-19 కట్టడికి గతంలో అమలు చేసిన వీకెండ్ లాక్‌డౌన్‌లో భాగంగా ఆదివారాల్లో లాక్‌డౌన్ తిరిగి కొనసాగించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. కేరళలో గడిచిన 24 గంటల్లో 30,007 తాజా పాజిటివ్ కేసులు నమోదవడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

రాష్ట్రంలో కరోనా పాజిటివిటీ రేటు గురువారం 18.03 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న తాజా కరోనా పాజిటివ్ కేసుల్లో 60 శాతం పైగా కేరళలోనే నమోదవుతుండటంతో వైరస్ కట్టడికి అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. కఠిన నియంత్రణలు, వారాంతపు లాక్‌డౌన్‌లను అమలుచేయడంతో పాటు వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత ముమ్మరంగా చేపడుతున్నారు.

# ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా పత్రాల పంపిణీ

హైదరాబాద్ , ఆగష్టు 27: బాగ్‌అంబర్‌పేటకు చెందిన ఐఎఫ్టీయూ ఆటో యూనియన్ నాయకులు శుక్రవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో టీఆర్ఎస్‌కేవీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వారికి గుర్తుంపు కార్డులతో పాటు రూ. 5లక్షల ప్రమాదబీమా పత్రాలు అందజేసి వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నిరంజన్, ఎస్‌కే చారి,



అంజన్న, వెంకటేశ్, రాజేశ్వరరావు, నరసింహ, హైమత్, రవి, హనుమంతు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# లెనోవో అవేర్ స్మార్ట్ లెర్నింగ్ సొల్యూషన్స్




హైదరాబాద్ , ఆగష్టు 27:ప్రముఖ టెక్నాలజీ సంస్థ వియోగదారుల కోసం తమ 'లెనోవో అవేర్' స్మార్ట్ లెర్నింగ్ సొల్యూషన్స్‌ను ప్రకటించింది. ఇది నవతరం ఐడియా ప్యాడ్ సి&ఎ 3ఐ ఐడియా ప్యాడ్, స్లిమ్ 5ఐ ల్యాప్ టాప్‌లలో మహమ్మారి కట్టడికి లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ఎదురైన డిజిటల్ సవాళ్ల కొన్నింటిని పరిష్కరించడం ద్వారా మేటి రిమోట్ అభ్యసన అనుభవాన్ని కలిగించడం లెనోవో అవేర్ సాఫ్ట్‌వేర్ లక్ష్యం లెనోవో ఇండియా కన్స్యూమర్ బిజినెస్ హెడ్ దినేష్ నాయర్ ఈ సాఫ్ట్‌వేర్‌ను తీసుకురావడం వెనుక ఉద్దేశాన్ని వివరించారు.

# టీటీడీ తరహాలో శ్రీశైలం అభివృద్ధి : నూతన ఈవో



శ్రీశైలం, ఆగష్టు 27: : శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి అమ్మ వార్లను నూతన ఈవో లవన్న శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శన అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం పరిపాలన భవ నంలో నూతన కార్యనిర్వహణ అధికారిగా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో లవన్న మీడియాతో మాట్లాడుతూ.. శ్రీశైల క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. భక్తులందరికీ సౌకర్యవంతంగా వసతి, దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులను ఆహ్లాదపరిచే విధంగా పచ్చదనాన్ని పెంపొందిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి పనులు చేస్తామని ఈవో లవన్న తెలిపారు.

# అలర్ట్: మూడు రోజుల పాటు భారీ వర్షాలు..

హైదరాబాద్ , ఆగష్టు 27:ఏపీలో రాగల మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. రాగల 24 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తాలతో పాటు రాయలసీమలో కొన్నిచోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ కోస్తా తీరానికి దగ్గరగా వాయువ్య బంగాళాఖాతంలో ఒక ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 ఎిఎ ఎత్తు వరకు విస్తరించి, ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణం వైపు వంగి ఉన్నది. దీని ప్రభావం వలన రేపు(28.08.2021) ఉదయం నకు వాయువ్య ఉ దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. 13ళీ౨ అక్షాంశము వెంబడి తూర్పు-పడమర 'షీర్ జోన్' సగటు సముద్ర మట్టానికి 4.5 ఎిఎ నుండి 7.6 ఎిఎ ఎత్తుల మధ్య కొనసాగుతూ, ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణం వైపు వంగి ఉన్నది. దీంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఇక తెలంగాణలోనూ మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల రెండు రోజులు తెలంగాణలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోకి పశ్చిమ, నైరుతి నుంచి కిందిస్థాయి గాలులు వీస్తున్నాయని తెలిపింది. నేడు(గురువారం), రేపు(శుక్రవారం) తేటికపాటి నుంచి మోస్తరు వానలు పడుతాయని, శనివారం పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. రెండు రోజుల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వానలు కురుస్తాయని చెప్పింది. వీటి ప్రభావం వలన రెండు తెలుగు రాష్ట్రాల్లో రాగల మూడు రోజుల వర్షాలు ఉన్నట్లు పేర్కొంది. ఉత్తర కోస్తా ఆంధ్ర మరియు యానాం, దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

# అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): సెప్టెంబరు 1వ తేదీ నుండి అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంగన్వాడి కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ అన్నారు. చందుర్తి మండల కేం ద్రంలో శుక్రవారం అంగన్వాడి పాఠశాల ప్రారంభం పై ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కేంద్రాలు పండుగల ఉట్టి పడేలా తీర్చిదిద్దాలన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులు. గర్భవతులు. బాలింతలు వచ్చే విధంగా దండోర చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు. గర్భిణీలకు వేడి వేడి ఆహారాన్ని అందించాలన్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అంగన్వాడీ పాఠశాలలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

# రాజన్నను దర్శించుకున్న బీసీ యువజన సంఘం జాతీయకార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): .తెలంగాణ లో ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రం మైన వేములవాడ దేవస్థానం లో రాజ రాజేశ్వర స్వామి వారి ని బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శివ గా ఈడుగురాల సురేష్ నియామకం మైన సందర్భంగా ఆయన రాజన్న కు దర్శించుకున్నారు.ముందుగా కొడె మొక్కు చెల్లించుకున్నారు .ఆయనతో పాటు నియోజకవర్గ అధ్యక్షుడు పల్లం సత్తన్న ఆధ్వర్యంలో బీసీ యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు కొండ యాదగిరి గౌడ్ స్వామి వారికి కొడె మొక్కు చెల్లించారు .అనంతరం జాతీయ కార్యదర్శి మాట్లాడుతూ ఈజిల్లా కు చేందిన నన్ను అత్యున్నత పదవి ఇచ్చి న ఆర్ కృష్ణయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు తమ అందరిపై రాజన్న ఆశీస్సులు ఎప్పుడు ఉండాలని వేదు కు న్నాని ఆయన తెలిపారు జిల్లాలో బీసీ సంఘం బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా మండలాల్లో నూతన కమిటీ లు వేసేందుకు కృషి చేయాలనికోరారు అనంతరం సందర్భంగా మున్నూరు కాపు సత్రం లో వారికి ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు నియోజకవర్గ అధ్యక్షుడు పల్లం సత్తయ్య గారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని దళిత బంధు మాదిరిగానే బిసి బంధు అమలు చేయాలని వారు కోరారు ఈకార్యక్రమంలో మున్నూరు కాపు నాయకులు కూరగాయల కోమరయ్య కొప్పుల బుచ్చి రాములు చిలుక రమేష్ కదిరె స్వామి గౌడ్ చిగురువెంకన్న జిల్లా యువజన నాయకులు అక్క పెల్లి నాగరాజు పెద్దూరి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు .

# రాజన్న నిత్యాన్నదాన ట్రస్టు నాంపల్లి లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికై రూ. 2 లక్షలువిరాళాలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో గల శ్రీ పార్వతి రాజరాజేశ్వరి స్వామి వారి ఆలయాన్ని శుక్రవారం కరీంనగర జిల్లా వాస్తవ్యులు యాచమనేని కిరణ్ రావు ,స్వప్న, కొడుకు రుద్ర రావు కుటుంబ సమేతంగా రాజన్న ను దర్శించుకున్నారు. తదనంతరం వారి చేతులమీదుగా ఒక లక్ష రూపాయలు అన్నదానం కొరకు మరియు నాంపల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ అభివృద్ధి కోరకు ఒక లక్ష రూపాయిలు పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు పి ఆర్ ఓ చంద్ర శేఖర్ కు అందజేసినారు వీరి వెంట స్థానిక సింగిల్విండో అధ్యక్షులు ఏనుగు తిరుపతి రెడ్డి ఉన్నారు.అనంతరం నాంపల్లి లో గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం నకై వెళ్ళారు.



# స్వయం ఉపాధిపై ద్రుష్టి సారించాలి

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): గ్రామీణ యువత స్వయం ఉపాధిపై ద్రుష్టి సారించాలని మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ. శాంతి గ్రామైక్య సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీ రేణుక ఎల్లమ్మ బేకరీ ని శుక్రవారం సర్పంచ్ అంజిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాల పై దృష్టి సారించి అభివృద్ధి చెందారన్నారు. గ్రామంలోని ప్రజలకు అన్ని రకాలు సేవలను అందుబాటులోకి తేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కృష్ణారావు.ఐకేపీ ఏపీఎం రజిత. స్వశక్తి మహిళా సంఘం వివో లు తదితరులు పాల్గొన్నారు,



# ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం సభ్యులు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 27:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశానుసారం జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజలకు కరోనా కట్టడి, ట్రాఫిక్ నిబంధనలు , డ్రంక్ అండ్ డ్రైవ్ , బాల్య వివాహాలు , బాల కార్మికవ్యవస్థ , సైబర్ నేరాలు , ఈ చాలన్ , 100 డయల్ తదితర అంశాలపై ఆటపాటలతో కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు .

ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి పోలీస్,బ్లూ కోడ్ కానిస్టేబుల్ శ్రీధర్ ,కళా బృందం ఇన్చార్జ్ సతీష్ చరణ్ , కళాబృందం సభ్యులు ఉన్నారు .



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.